

జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్





సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మంచినీరిచ్చి కాపాడండి



నెల్లూరు (జడ్పీ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు శిథిలావ్యవస్థ చేరాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఓసారి తాగునీరు ఇస్తున్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారి ఇచ్చేలా చూడండి. గిరిజన ప్రాంతాల్లో క్లోరినేషన్ లేక ఎర్రనీళ్లు తాగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించి, వాళ్ల ఆరోగ్యాలను కాపాడాలి'.. అంటూ జడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలతోపాటు జడ్పీటీసీ సభ్యులు కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సమావేశం శనివారం జడ్పీలోని సమావేశ మందిరంలో జరిగింది. గ్రామీణ నీటిసరఫరా, నెట్‌క్యాప్, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖలపై సభ్యులు చర్చించారు. తాగునీటి ఇబ్బందులపై ఎక్కువమంది సభ్యులు గగ్గోలు పెట్టారు.

● తాగునీటి ట్యాంకులపై దృష్టి

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాగునీటిలో క్లోరి నేషన్, ట్యాంకుల క్లీనింగ్ సక్రమంగా ఉండటం లేదని, అనేక చోట్ల తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వాటిని వెంటనే కూల్చకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీపీడబ్ల్యూ తాగునీటి పథకాల నిర్వహణను పూర్తిగా వదిలేసిందని, దీంతో తీరప్రాంతాల్లోని గిరిజనులు కలుషితనీళ్లు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వింజమూరు జడ్పీటీసీ జీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి, కలిగిరి, వింజమూరు మండలాల్లో నీటి సమస్యతో కిడ్నీ రోగాలు ఎక్కువగా ఉంటున్నాయని, సోమశిల నీటిని ఈప్రాంతాలకు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ఉదయగిరి కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారని, కనీసం రెండు రోజులకు ఒకసారైనా సరఫరా చేయాలని కోరారు. వాకాడు జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో తాగునీటి పథకాలకు 24 గంటలు కరెంటు సౌకర్యం ఉండదని, 24 గంటలు విద్యుత్ సరఫరా లైన్లు

- మిగతా 6లో

● ప్రాజెక్టును పునః ప్రారంభించాలి

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంతో ఉద యగిరి ప్రజలకు సురక్షి తమైన తాగునీటి అం దించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. దాన్ని పూర్తి చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దాదాపు 30వేలమంది జనాభా ఆరోగ్యానికి సంబంధించిన ఈ పథకాన్ని మళ్లీ అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పెనుమీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా ఉంది జిల్లా రైతాంగం పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. నేటి కూటమి ప్రభుత్వంలో కూడా డీఏపీ బస్తాపై రూ.50, యూరియా బస్తాపై రూ.80కిపైగా వ్యాపారులు అమ్ముతున్నా అధికారపార్టీ నేతలెవరూ పట్టించుకోవడంలేదని వారంటున్నారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా జిల్లాలో 70శాతానికిపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరందరిపై అదనపుభారం పడుతోంది. ఈ విపత్కర పరిణామాలను అనుభవిస్తున్న అన్నదాతలు గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దొందూ దొందూనే అని విమర్శిస్తున్నారు.

- జలదంకి, (ఆంధ్రజ్యోతి)

ఎరువులకే అధిక వ్యయం



వరి నారుమడికి యూరియా చల్లుతున్న యువరైతు

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయం
- రైతులపై రూ.15 కోట్లకుపైగా అదనపు భారం
- యూరియా, డీఏపీ కొనుగోలుకుపోతే నానో, మిశ్రమ ఎరువులు అంటగడుతున్న వ్యాపారులు
- వాటిని కొనేందుకు ముందుకురాని అన్నదాతలు
- పట్టీపట్టనట్లుగా పాలకులు, అధికారులు

జిల్లాలోని పెన్నార్‌డెల్టా కింద 2.47లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 61వేల ఎకరాలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 98వేల ఎకరాలు, దక్షిణ కాలువ కింద 35వేల ఎకరాలు.. ఇలా మొత్తం ఐదులక్షల ఎకరాలకుపైగా రైతులు రబీసీజన్‌లో వరిసాగు చేపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పైఆయకట్టు అంతా సాగవుతోంది. దీనికితోడు వాణిజ్య పంటలయిన మినుము, పెసర, పొగాకు, పత్తి తదితర పంటలు రెండులక్షల ఎకరాలకుపైగా సాగవుతోంది. పండ్లతోటలు, జామాయిల్, సవకల సాగు కూడా జిల్లాలో ఎక్కువగానే ఉంది. వరిమాగాణికి ఎకరానికి సీజన్‌కు డీఏపీ-1, యూరియా-3 బస్తాల వంతున వాడతారు. ఇక మిశ్రమ ఎరువులు 17-17-17, 16-35-14 లాంటివి ఎకరానికి రెండేసి బస్తాల వంతున పైరుపై చల్లుతారు. ఎరువులు అధిక ధరలకు అమ్మడం ద్వారా ఒక్కో ఎకరానికి డీఏపీ, యూరియా కొనుగోలుపై రూ.290 అదనపు భారం పడుతోంది. ఇలా వరిసాగయ్యే ఐదులక్షల ఎకరాలకు వినియోగించే యూరియా, డీఏపీపై రూ.14.5కోట్ల అదనపు భారం రైతులపై పడుతోంది. రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా కేవలం ఐదుశాతం మంది రైతులకే అందుతోంది. మొత్తం రైతాంగానికి అదునులో ఎరువులు అందివ్వడం

- మిగతా 6లో

క్రీడా ఎంపికలపై విమర్శలు

- అస్తవ్యస్తంగా అంతర్ కళాశాలల క్రీడలు
- పోటీల నిర్వహణపై నిరుత్సాహం
- అధికారులు, నిర్వాహకుల మధ్య సమన్వయలోపం

ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు



నెల్లూరు(విద్య), నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ) నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడలు, ఎంపికలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా అంతర్ కళాశాలల క్రీడాపోటీల నిర్వహణ, యూనివర్సిటీ జట్ల ఎంపిక షెడ్యూల్ గందరగోళంగా మారింది. దీంతో క్రీడాకా రులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని కళాశాలలకు మాత్రమే లబ్ధిచేకూరేలా పోటీల నిర్వహణ చేస్తుండడంతో తాము క్రీడా ప్రయోజనాలు పొందలేకపోతున్నామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కూడా పోటీలు సైతం ఇదే రీతిలో జరిగాయి.

● ముందస్తు సమాచారమేదీ ?

వీఎస్‌యూ మహిళా అంతర్ కళాశాలల పోటీల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా ఉన్న కళాశాలల్లోని క్రీడాకారులకు ముందస్తు సమాచారం లేదు. అంతేకాక సమయం కూడా ఇవ్వకుండా శని,ఆదివారల్లో పోటీలకు హాజరు కావాలని ప్రకటించారు. ఇది ఎంతవరకు సమంజసమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా శనివారం నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా క్రీడాపోటీలు, ఎంపికలు ప్రారంభించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య విజయభాస్కర్ రావు, రిజిస్ట్రార్ సునీత ప్రారంభించారు. పోటీలకు మొత్తం 13 కళాశాలల నుంచి జట్లు హాజరయ్యాయి. అయితే, ముందు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం ప్రారంభం కావాల్సిన పోటీలు మధ్యాహ్నం 12 గంటలపైన ప్రారంభించారు. దీంతో క్రీడాకారులంతా అతిథుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరగాల్సి ఉండగా, కేవలం ఖోఖోలోనే ఫైనల్స్ నిర్వహించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురవడంతోపాటు మరోరోజు పోటీల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వీఎస్‌యూ అధికారులు, నిర్వాహకుల అనాలోచిత నిర్ణయాలు, సమన్వయలోపంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

● భోజనాలకు ఇక్కట్లు

తమకు వసతి, భోజనాలు కల్పించాల్సిన నిర్వాహకులు పూర్తిగా విఫలమైనట్లు క్రీడాకారులు తెలిపారు. ప్రారంభోత్సం అయ్యాక ఎవరికివారు వెళ్లిపోవడంతో భోజనాలు ఎక్కడ చేయాలో తెలియక క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో వారిని తీసుకువచ్చిన పీడీలే హోటళ్ల నుంచి పార్శిల్స్ తెప్పించి పెట్టారు. వీఎస్‌యూ జట్టుకు ఎంపిక చేసే ఈ పోటీలను తూతూ మంత్రంగా ఎలా నిర్వహిస్తారని, దీనిపై ఉన్నతాధికా రులు దృష్టి సారించారని క్రీడాకారులు కోరుతున్నారు. కాగా తొలిరోజు జరిగిన పోటీలకు అబ్జర్వర్‌గా డాక్టర్ అమ్మాజీ వ్యవహరించగా, డీకేడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, యూనివర్సిటీ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ వెంకట్రాయులు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సీ విజయకళ, పీడీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఊసేలేని గ్రామం

- బయటకు ఇసుక తరలిస్తే జరిమానా
- కట్టుబాట్ల ఊరు 'వెల్లంటి'
- 2021లో ఉత్తమ పంచాయతీగా ఎంపిక



వెల్లంటి గ్రామ వ్యూ

రాష్ట్రంలో సురక్షితమైన తాగునీరు అందని గ్రామం ఏదైనా ఉందేమోకాని.. బెల్టు దుకాణం లేని గ్రామమంటూ లేనేలేదు. కానీ ఇప్పటికీ ఆ గ్రామంలో బెల్టుషాపుల నిర్వహణపై నిషేధం ఉందటే ఆశ్చర్యమే. కాని ఇది నిజం. అలాగే గ్రామం నుంచి బయట ప్రాంతాలకు ఇసుక రవాణా చేయకూడదనే ఆంక్ష కూడా ఉంది. ఎవరైనా అతిక్రమిస్తే రూ. 10 వేల జరిమానా విధిస్తారు. 2021లో జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామసభల నిర్వహణ అవార్డును సొంతం చేసుకున్న గ్రామం నెల్లూరు రూరల్ మండలం పాతవెల్లంటి. 300 ఎకరాల వరకు సీజేఎఫ్ఎస్ భూములు కలిగి, ప్రభుత్వం చేయూతతో పైర్లు సాగవుతున్న గ్రామం కూడా ఇదే. ఇన్ని విశేషాలున్న ఈ గ్రామం నుంచి తెలుసుకుందాం.

6

రెవెన్యూలో ప్రక్షాళన

- కార్పొరేషన్‌లో ఆర్వోలు, ఆర్ఐలంతా బదిలీ
- కమిషనర్ సూర్యతేజ విప్లవాత్మక నిర్ణయం
- నెల్లూరు నగర చరిత్రలో ఇదే ప్రథమం
- మంత్రి హెచ్చరికతో మారిన సీను

నెల్లూరురూరల్,నవంబరు23,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్ చరిత్రలోనే రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేస్తూ కమిషనర్ సూర్యతేజ తీసుకున్న నిర్ణయం, విప్లవాత్మకమైనదని జిల్లాతో పాటు రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు రెవెన్యూ అధికారుల(ఆర్వోల)తోపాటు పదిమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐల)ను ఏకకాలంలో బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులిచ్చారు. కార్పొరేషన్ ఏర్పడ్డాక ఇప్పటి వరకు ఒక విభాగంలో అధికారులందరినీ ఒకేసారి బదిలీ చేయడం ఇదే ప్రథమం. ఆర్ఐల స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చిన కమిషనర్ ముగ్గురు ఆర్వోల బాధ్యతలను ప్రస్తుత మేనేజర్ ఇనయతుల్లాకు కట్టబెట్టారు. బదిలీ చేసిన వారందరిని వివిధ విభాగాల్లో నియమించాక ఆర్వోలను శానిటేషన్ సూపర్‌వైజర్లుగా నియమించారు.

ఆర్ఐలుగా ఉన్న సీహెచ్ క్రిష్ణంరాజు స్థానంలో ఆర్ వంశీనాథ్ రెడ్డి, కే కృపాకర్‌స్థానంలో టీ కార్తీక్‌రెడ్డి, ఐ చిన్నబాబు స్థానంలో బీ శ్రీసందీప్, వీ పద్మావతి స్థానంలో టీ శరత్‌బాబు, ఏ సునీల్‌కుమార్ స్థానంలో ఎస్ శ్రావణ్‌కుమార్, ఎన్ క్రిష్ణకిషోర్ స్థానంలో జీ లోకనాథంలను ఆర్ఐలుగా నియమించారు. కాగా వీరంతా రెగ్యులర్ ఆర్ఐలు. అడిషినల్ ఆర్ఐలుగా ఉన్న సీహెచ్ రవి, ఎస్ అజయ్, వై శ్రీనివాసులు, జీ పెంచలయ్యలను ఆ పోస్టు నుంచి తొలగించారు. వారివారి అర్హతలను బట్టి వివిధ విభాగాల్లో నియమించారు. కాగా రెవెన్యూ అధికారులు(ఆర్వో)గా కొనసాగు తున్న అబ్దుల్ సమ్మద్, పీ శ్రీనివాసులు, వై రాజేశ్వరిలను ఆ స్థానాల నుంచి రిలీవ్ చేసి, వారి బాధ్యతలను మేనేజర్ హెచ్ ఇనయతుల్లాకు అప్పగించారు. బదిలీ అయిన ఆర్వోలు సమ్మద్, రాజేశ్వరిలను ఆరోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్లుగా నియమించారు. కమిషనర్ శ్రీనివాసులును రెవెన్యూ విభాగంలో సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

● మంత్రి సమీక్షతో మారిన సీను

పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఆస్తి పన్ను సుమారుగా రూ. 170 కోట్ల వరకు కార్పొరేషన్ చెల్లించాల్సి ఉంది. వాటిని వసూలు చేయడంలో అటు ఆర్వోలు, ఇటు ఆర్ఐలు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించిన ఆయన హెచ్చరికలు జారీ చేశారు. 'మీరు చేయలేకపోతే పక్కకు తప్పుకోండి.. కొత్తవారితో చేయించు కుంటా' నని పేర్కొన్నారు. అయినా ఎవరిలోనూ మార్పు రాలేదు. తాజాగా జరిగిన బదిలీలు నారాయణ సమీక్ష ఫలితమేనంటూ ఎన్ఎంసీలో చర్చసాగుతుంది. ఇకపోతే సిటీప్లానింగ్‌లోనూ భారీ మార్పులు చోటుచేసుకుంటాయని సంకేతాలు వెలువడుతున్నాయి. కాగా కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో భారీ మార్పులు జరగబోతున్నాయంటూ ఈ నెల 8న ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

మంచు.. ముంచేను ప్రమాదాల్లో..

కొద్ది రోజులుగా జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ఏడుగంటలు దాటుతున్నా.... దట్టమైన మంచు తప్ప మరేమీ కనిపించడంలేదు. ఈ సమయంలోనే గతంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగాయి. మరి ఈ ఏడాది కొంచెం ముందుగానే వచ్చిన పొగమంచు ఎన్ని ప్రమాదాలకు కారణమవుతుందో... ఎంతమంది ప్రాణాలు బలి తీసుకుంటుందో... ఎవరి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందో చూడాలి. రోడ్డు పక్కన వాహనాలు నిలిపివేయడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మంచుకాలంలో తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేయాలి. అందులోనూ తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

-నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, (ఆంధ్రజ్యోతి)



మంచులో జాతీయరహదారిపై ఆగి ఉన్న వాహనాలు

- జిల్లాను కమ్మేస్తున్న పొగమంచు
- ఉదయం ఏడువరకు కనిపించని రహదారులు
- రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో యాక్సిడెంట్లు
- రెస్ట్ ఏరియాల్లోనే ఆపుచేసుకోవాలి
- తప్పనిసరి అయితేనే ప్రయాణం
- జాగ్రత్తలు మరువద్దు సుమా..!

జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారి వ్యాపించడంతో మంచు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా హైవేలో అతివేగంగా వాహనాలు వెళుతుంటాయి. సాధారణ పరిస్థితుల్లో ప్రయాణాలకు, పొగ మంచులో ప్రయాణం చేయడానికి చాలా తేడా ఉంది.హైవేపై మంచు అధికంగా ఉన్నప్పుడు జరిగే ప్రమాదాల్లో 50 శాతానికి పైగా ఆగిఉన్న వాహనాలను ఢీకొనే... జాతీయ రహదారికి పక్కనే వరుసగా వాహనాలు నిలపడం ద్వారా మంచులో వాహనాలు కనిపించకపోవడంతో వాటిని ఢీకొనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. హైవే అథారిటీ వారు జిల్లాలో పలుచోట్ల రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేసుకుని విశ్రాంతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

● ఈ జాగ్రత్తలు పాటించండి

● పొగమంచు సమయంలో ప్రయాణాలు చేసే వారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

● దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైటును ఆన్ చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారిపై కారు ఉనికిని ఇతర వాహనాలు గుర్తించే అవకాశం ఉంది. విపత్తు హెచ్చరికల లైటు అంటే.. కారుకు నాలుగు వైపులా ఉన్న లైట్లు వెలుగుతూనే ఉంటాయి.

● పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలపై దృష్టి సారిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచి మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్‌ను తిప్పుతూ వాహనాన్ని అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనాన్ని నడపాలి.

● డ్రైవింగ్ చేసేటప్పుడు జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న రేడియమ్ రైలింగ్ గుర్తులను ఫాలో అవుతూ వాహనం నడపాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డుప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కు లను గమనిస్తూ వాహనం నడపాలి. ఇలా చేయడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చు.

● పొగమంచు కారణంగా కారు ముందు, వెనుక వైపున అద్దాలపై తెల్లగా మంచు పేరుకు పోతుంది. దీని ద్వారా రహదారి సరిగా కన్పించదు. అయితే మంచును ఆటోమేటిక్‌గా కరిగించేందుకు కార్లలో డీఫాగర్‌ను వేయడం ద్వారా అద్దాలపై పేరుకున్న మంచు కరిగిపోతుంది.

● మంచులో ప్రయాణం చేసే సమయంలో వాహనాల్లోని సౌండ్‌ను తక్కువగా ఉంచుకోవాలి. పొగ మంచులో రోడ్డు స్పష్టంగా కనిపించే అవకాశం చాలా తక్కువ. అందుకే డ్రైవింగ్ చేసే సమయంలో మనసును డ్రైవింగ్‌పై కేంద్రీకరించాలి.

● సాధారణ పరిస్థితుల్లోనే మద్యం మత్తులో డ్రైవ్ చేయడం ఏమాత్రం మంచిదికాదు. అలాంటిది దట్టమైన పొగమంచు కమ్ముకున్నప్పుడు మద్యం సేవించి వాహనాన్ని నడపడం చాలా ప్రమాదకరం.

● మంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మీ ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి.తద్వారా ఆ వాహనాలు పొరపాటున ప్రమాదానికి గురైతే వెంటనే మనం పక్కకు తప్పుకునే అవకాశం ఉంటుంది.

● పొగ మంచులో ప్రయాణించే వారు ముందుగా హెడ్‌లైట్ల పనితీరును చెక్ చేసుకోవాలి. ఒక లైటు మాత్రమే పనిచేస్తున్నా, లైట్లు తక్కువ వెలుతురులో ఉన్నా మీ ప్రయాణాన్ని మానుకోవాలి.

జాగ్రత్తగా వాహనాలు నడపండి



పొగమంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవసరం అనుకుంటేనే ప్రయాణాలు చేయండి. ఎక్కువ వేగం వెళ్లకుండా తక్కువ స్పీడులో వాహనం నడపాలి. పూర్తి దృష్టి వాహనంపై ఉంచాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవాలి.

- చందర్, డీటీసీ

డిగ్రీ పరీక్షలకు ఐదుగురి గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. 82 మంది విద్యార్థులకు గాను 77 మంది హాజరయ్యారు.



వైభవంగా
మహారుద్రాభిషేకం

నెల్లూరు బాలాజీనగర్‌లోని త్యాగరాజ స్వామి కల్యాణ మండపంలో శనివారం మహారుద్రాభిషేకం వైభవంగా జరిగింది. ఐదు అడుగుల మహాశివలింగానికి భక్తులే స్వయంగా నామగోత్రాలతో బారులుతీరి అభిషేకాలు చేశారు. కుర్తాళం పీఠం ఆస్థాన అర్చకులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాసాలు చేశారు. అనంతరం సుగంధ పుష్పాలతో మహాశివుడికి ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)



ఫాగింగ్ లేదు.. బ్లీచింగే..!

మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధి, ఎంపీడీవో కార్యాలయంలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. ఈ యంత్రాలన్నీ చెడిపోయి మూలకు చేరడంతో గ్రామాలలో దోమల నివారణకు అధికారులు కేవలం బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకుంటున్నారు. ఫాగింగ్ యంత్రాలతో మలాథిన్, డీజిల్ మిశ్రమంతో వీధుల్లో స్ప్రే చేస్తే దోమలు చనిపోతాయని గ్రామస్థులు చెబుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

మద్యం ముట్టని 'వెల్లంటి'

ఆదర్శ గ్రామం

- బెల్టు షాపులకు గ్రామస్థుల వ్యతిరేకం
- 29 ఏళ్లుగా నిషేధాజ్ఞలు
- గ్రామం నుంచి ఇసుక బయటకు తీసుకెళ్తే జరిమానా
- 2021లో ఉత్తమ పంచాయతీగా ఎంపిక



నెల్లూరు రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకి పడమర దిక్కున 22 కిలోమీటర్ల దూరంలో పాతవెల్లంటి గ్రామం ఉంది. 1995 నుంచి సీపీఎం అభ్యర్థులే సర్పంచులుగా ఇక్కడ గెలుస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు కొన్ని కట్టుబాట్లు పెట్టుకుని ఊరంతా అమలు చేస్తున్నారు. అందులో ముఖ్యమైంది మద్యం నిషేధం. గత 29ఏళ్లగా ఈ ఊర్లో మద్యం విక్రయాలు లేవు. ఎవరైనా తాగాలంటే పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే. ఈ కట్టుబాటును అతిక్రమిస్తే రూ. 10 వేలు జరిమానాతోపాటు గ్రామస్థులే స్వచ్ఛందంగా ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తారు. పెద్ద పెద్ద నేతలు కూడా గ్రామంలో బెల్టు షాపులు ఏర్పాటు చేయాలని తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరికి కల్లు అమ్మకాలను సైతం గ్రామ సరిహద్దులకే పరిమితం చేశారు.

● **ఇసుక తరలిస్తే జరిమానా**

గత వైసీపీ హయాంలో పెన్నా పరివాహకం నుంచి ఇసుకను ఇష్టానుసారం తవ్వేసి అన్నీ ప్రాంతాల్లోనూ జోరుగా అమ్ముకున్నారు. కానీ వెల్లంటి గ్రామం పెన్నాకు అతిసమీపాన ఉన్నా, ఇసుకను బయట ప్రాంతాలకు రవాణా చేయకుండా ఊరి కట్టుబాటుతో నిషేధించారు. అలా ఎవరైనా చేస్తే రూ. 10 వేల జరిమానా విధిస్తారు. జరిమానా ద్వారా వచ్చిన నగదును గ్రామప్రజల అవసరాలు, ఆలయాల అభివృద్ధికి కేటాయించడం ఇక్కడ ప్రత్యేకత. ఇకపోతే గ్రామ కంఠం కింద గుర్తించిన 8 ఎకరాల భూమిని ఆంజనేయస్వామి ఆలయానికి కేటాయించారు. వచ్చిన ఆదాయాన్ని గుడి అవసరాలకు వినియోగిస్తారు.

● **ఉత్తమ పంచాయతీగా అవార్డు**

గ్రామప్రజల ఇబ్బందులు, అవసరాలు, భవిష్యత్ కార్యచరణపై పంచాయలో తీసుకున్న తీర్మానాలకు ఊరంతా కట్టుబడి ఉండాల్సిందే. పంచాయతీలో విధిగా సర్పంచి అధ్యక్షతన వార్డు సభ్యులు గ్రామ సభలు నిర్వహిం చడం ఆనవాయితీ. అందుకే 2019-20 లో కేంద్ర బృందం పరిశీలించి 2021లో నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గ్రామసభ కేటగిరీ కింద ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డును ప్రకటించిన కేంద్రం రూ. 10 లక్షల నిధులు కూడా ఇచ్చింది. వాటిని తాటిపర్తి రహదారి నుంచి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి వినియోగించారు.



సీజేఎఫ్ఎస్ భూములకు గ్రామస్థులు వేసుకున్న దారి

● **అత్యధికంగా సీజేఎఫ్ఎస్ భూములు**

నెల్లూరు రూరల్ మండలంలో అత్యధికంగా (300 ఎకరాల వరకు) సీజేఎఫ్ఎస్ భూములున్న గ్రామం పాతవెల్లంటి. అన్ని కులాల వారు లబ్ధిదారులుగా ఉన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సుమారు 40 బోర్లు వరకు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ప్రభుత్వ వనరులను ఉపయోగించుకుంటూ పంటలను సాగు చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు జిల్లాకు ఎవరొచ్చినా తొలత ఈ భూములనే ఇప్పటికీ పరిశీలించడం ఆనవాయితీ.

కట్టుబాటుగా ఉంటాం



గ్రామప్రజలంతా కట్టుబాటుగా ఉంటాం. ఏ నిర్ణయమైనా కలిసి తీసుకుంటాం. గ్రామ ప్రయో జనాలు, భవిష్యత్ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల సహకారం మరువరానిది.

- పాదర్తి రాధ, సర్పంచి

ఊరంతా కుటుంబ సభ్యులుగా ఉంటాం



ఊర్లో ప్రజలంతా కుటుంబ సభ్యులుగా ఉంటాం. ఊరి భవిష్యత్ అంటే అది మా భవిష్యత్ కూడా... మా ఊర్లో కుల, మత బేదాలు లేవు. తప్పు చేస్తే ఎవరికైనా జరిమానా విధిస్తాం.

- పల్లవరపు చెంచయ్య

ఎరువులకే అధిక వ్యయం

(5వ పేజీ తరువాయి)

లేదు. దీంతో రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఇక మిగిలిన మెట్ట పంటలకు, పండ్లతోటలకు వినియోగించే ఈ రకాల ఎరువుల కారణంగా రైతులపై కూడా రూ.2కోట్లకుపైగా అదనంగా భారం పడుతోంది. దీనికితోడు కూలీల ఖర్చులు, క్రిమిసంహారక మందుల పెరుగుదలను చూస్తే మరింత ఆర్థిక భారం అన్నదాతలపై పడుతోంది.

● **డీలర్ల దోపిడీ**

కంపెనీలకు సంబంధించిన జిల్లా డీలర్ల వద్దే ఈ దోపిడీ జరుగుతోంది. అదెలాగంటే డీలర్లకు ఎరువులను దుకాణదారులు ఇండెంట్ పెడితే యూరియా, డీఏపీ లోడు కావాలంటే కేజీ ప్యాకెట్ల మిశ్రమ ఎరువు లేదా నానో డీఏపీ, యూరియా కేసులు అంటగడుతున్నారు. వీటిని తీసుకోకపోతే యూరియా ఇవ్వడంలేదని ఎరువుల అంగళ్లవారు గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్యాకెట్లు అమ్మాలంటే కొనే రైతులు అరుదుగా ఉన్నారు. దీంతో తాము వీటిని ఏం చేయాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో అదనపు ధరను యూరియా, డీఏపీలపై వసూలు చేయాల్సి వస్తోందని వారంటున్నారు. జిల్లాస్థాయిలో కంపెనీల డీలర్లను అదుపు చేయగలిగితే రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు ఇవ్వగలుగుతామని వ్యాపారులు పేర్కొంటున్నారు.

● **వ్యవసాయశాఖ ఏం చేస్తున్నట్లు ?**

జిల్లాలో యూరియా, డీఏపీలను ఎమ్మార్పీకంటే అధిక ధరలకు వ్యాపారులు అమ్ముతుంటే జిల్లా వ్యవసాయశాఖ ఏం చేస్తున్నట్లు అని రైతులు, రైతుసంఘాల ప్రతినిదులు ప్రశ్నిస్తున్నారు. వారు తమ కార్యాలయాలు వదిలి బయటకు వస్తున్నారా ? అని ప్రశ్రిస్తున్నారు. లేదా వారికి ఈ దోపిడీలో వాటా ఏమైనా ఉందా ? వారు నిలదీస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు నిద్రమత్తు వీడి అధిక ధరలకు ఎరువుల అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మాలకొండలో అన్నదానానికి 85 బస్తాల బియ్యం

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాలకొండలక్ష్మీ నరసింహ స్వామి భక్తుల అన్నదానానికి లింగసముద్రం మండలం రామకృష్ణాపురం వాసులు శనివారం 85 బస్తాల బియ్యాన్ని డీసీ సాగర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడారు. గ్రామస్థులతోపాటు ఇతరుల నుంచి ఈ బియ్యంసేకరించామని తెలిపారు. మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు వారిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బీ వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీసీ సాగర్‌బాబుకు బియ్యంను అందజేస్తున్న రామకృష్ణాపురం వాసులు

సాయిపేటలో ప్రబలుతున్న విషజ్వరాలు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట గ్రామస్థులు జ్వరాలబారిన పడుతున్నారు. గ్రామంలో ఇప్పటివరకు 50 మందికిపైగా జ్వరాల బారినపడ్డారు. వారిలో కొందరికి జ్వరం తగ్గకపోవడంతో పట్టణాలలోని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అక్కడ రక్తపరీక్షలు చేయించుకోగా టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ తదితర విషజ్వరాలు ఉన్నట్లు తేలింది. మరికొందరికి ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు రక్తం ఎక్కించుకుంటున్నారు. వీరికి వైద్యఖర్చులకు రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసుకున్నట్లు జ్వర బాధితులు వాపోతున్నారు.

● **అధికారుల అప్రమత్తం**

విషయం తెలుసుకున్న మండల వైద్యశాఖ, పంచాయతీ అధికారులు శనివారం గ్రామంలో పర్యటించారు. మురుగునీటి గుంటల్లో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లిం చడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయించారు. ఈవోపీఆర్‌డీ ఆదినా రాయణరావు, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్ఎమ్ సుజాత, ఎమ్ ఎల్‌హెచ్‌పీసీ హెచ్‌వో మార్గరెట్, ఆశా కార్యకర్తలు జ్వరాల బారినపడిన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. 15 రోజుల నుంచి గ్రామంలో జ్వరాలు ప్రభలుతుంటే వైద్యశాఖ అధికా రులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి నసీరుద్దీన్‌ను వివరణ కోరగా జ్వరాలు ఉన్నాయని తెలుసుకొని సర్వే చేయించి, వైద్యశిబిరం నిర్వహించామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు.



బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలిచి, ఆవరణలోని తుప్పపట్టిన వాహనాల వివరాలను ఎస్ఐను అడిగి తెలుసుకున్నా రు. అనంతరం నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశా రు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ సుబ్ర మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ మరిది నాయుడు ఉన్నారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు పోలీసుస్టేషన్లలోనే శిథిలమై పోకుండా కోర్టు అనుమతి తీసుకుని వేలం వేయాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంతో పాటు సబ్ డివిజన్‌లోని కందుకూరు, గుడ్లూరు సర్కిల్ కార్యాలయాలు, అన్ని పోలీసుస్టేషన్లను పరిశీలించారు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, గుడ్లూరు సీఐ మంగారావు ఉన్నారు.

వీఎస్‌యూలో ఉద్యోగ దరఖాస్తులు

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని పలు విభాగాలకు పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు రీసెర్చ్ అసోసియేట్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునేందుకు వీఎస్‌యూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బయోటెక్నాలజీ, బిజినెస్ మేనేజ్‌మెంట్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, మెరైన్ బయాలజీ, ఫిజిక్స్ సోషల్ వర్క్, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాలకు, కావలిలోని పీజీ సెంటర్ కళాశాలలో బోటనీ, ఎకానామిక్స్, జూలాజీ, కామర్స్ విభాగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 0861 - 2330484 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మంచినీరిచ్చి కాపాడండి

(5వ పేజీ తరువాయి)



ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. వ్యవ సాయ శాఖపై సమీక్ష జరగ్గా వెంకటగిరి ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రైతులంతా పంటలు వేసుకుంటున్నారని, కానీ చెరువులకు నీళ్ల ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు తెలియచేయడం లేదన్నారు. వెంటనే రైతులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఎరువులు అం దుబాటులో ఉంచాలని కోరారు.

● **రూరల్ ఎమ్మెల్యే అసంతృప్తి**



జడ్పీ సమావేశంలో సాగునీరు, వ్యవసాయం తదితర అంశాలు ఉన్నప్పటికీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సభలో లేకపోతే సమస్యలు ఎవరికి చెప్పాలి. వాటిని ఎవరూ పరిష్కరించాలని ప్రశ్నించారు. గత సమావేశాలకు సైతం ఆశాఖ అధికారులు రాలేదని, దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు కారణం లేకుండా అధికారులు గైర్హాజరైతే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

● **పార్టీలను పక్కనపెట్టి ముందుకు రండి : ఆనం**

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తు న్నదని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వమే వాడేసుకొని ఇబ్బంది పెట్టిందన్నారు.కొంతమంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు మాపార్టీ వేరు మీ పార్టీ వేరన్నట్లుగా వ్యవహరిస్తూ అభివృద్ధికి దూరం అవుతున్నారన్నారు. పార్టీలు అభివృద్ధి చేయలేవని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. పార్టీలను పక్కన పెట్టి అభివృద్ధిలో భాగ్యస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జడ్పీ సమావేశంలోనూ ఎక్కువమంది సభ్యులు సమస్యలపై మాట్లాడటం లేదన్నారు.

● **ప్రొటోకాల్ పటిష్టంగా అమలు చేయండి**



మండలస్థాయిలో అధికారులు ప్రొటోకాల్ ను పాటించడం లేదని పలువురు సభ్యులు వాపోయారు. మండల సమావేశాలకు సైతం అధికారులంతా రావడం లేదన్నారు. ఫోన్లు చేసినా స్పందించే పరిస్థితి ఉండటం లేదని పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. జడ్పీ చైర్మపర్సన్ ఆనం ఆరుణమ్మ మాట్లాడుతూ తనకే ప్రొటోకాల్ ఇబ్బందులు ఉన్నాయన్నారు. తన మండలంలో జరిగిన పల్లె పండుగకు ఎంపీడీవో తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్‌ను కోరారు.

● **మోడల్ గ్రామాలను ఎంపిక చేయండి**

ప్రస్తుత పరిస్థితుల్లో సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగమని, దీనిపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని మంత్రి ఆనం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ఎక్కువ మంది ముందుకు వస్తున్నారని, అయితే ఇది పట్టణాలకు, నగరాలకు పరిమితం కాకుండా గ్రామాలకు విస్తరించేందుకు ప్రతి మండలానికి ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేయాలన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు.

బీజేపీ సంబరాలు

నెల్లూరు(క్రైం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెం బ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచిపెట్టి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇది చరిత్రాత్మక విజయమని, ఇంతటి విజయాన్ని అందించిన మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మహారాష్ట్ర అభివృద్ధిలో దూసుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రబోలు రాజేష్, గడ్డం విజయకుమార్, కరణం సుభాషిని, గిరికుమార్ గౌడ్, మదన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో మిఠాయిలు పంచుకుంటున్న ఆ పార్టీ నాయకులు

జీవో 73 ప్రకారం వ్యవసాయ కార్మికులకు కూలి చెల్లించాలి

● **జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య**

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వరి నాట్లలో వ్యవసాయ కార్మికులకు జీవో నెంబర్ 73 ప్రకారం కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమై ముమ్మురంగా పనులు సాగుతున్నాయన్నారు. కానీ జిల్లాలోని వ్యవసాయ కూలీలకు పనులు దొరకటం లేదని కొందరికి పనులు దొరకినా సరైన కూలి రావటం లేదన్నారు. వ్యవసాయ పనులలో యంత్రాలు రావటం, బెంగాల్, బీహార్ వలస కూలీలు రావటంతో స్థానికులకు పనులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవో నెంబర్ 73 తీసుకు వచ్చి వ్యవసాయ కార్మికులు 6గంటలు పనిచేస్తే రూ.480 ఇవ్వాలని తెలియచేసిందన్నారు. అయితే ఈ జీవో ఎక్కడా అమలు కావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వరి నాట్లకు కాంట్రాక్టు కుదుర్చుకుని కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలపై సబ్సిడీ కొనసాగించాలన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టా పెద్దాబ్బాయ్, నక్క రాధయ్య, బెల్లంకొండ నాగమ్మ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య



ఇందరాభవన్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు

ఝూర్ఖండ్‌లో గెలుపుపై
కాంగ్రెస్ సంబరాలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఝూర్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబర్భంగా చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఝూర్ఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించిందన్నారు. కేరళ రాష్ట్రంలోని వయనాడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రియాంకాగాంధీ 4 లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారన్నారు. అయితే మహారాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో అక్రమాలకు బీజేపీ కూటమి పాల్పడిందని అందుకే కాంగ్రెస్ పార్టీ కూటమికి తక్కువ సీట్లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఏటూరి శ్రీనివాసులరెడ్డి, పీసీసీ సభ్యులు బాలసుధాకర్, సంజయ్ కుమార్, అల్లాఉద్దీన్, గణేష్, మల్లికార్జునరెడ్డి, షేక్ హుస్సేన్ బాషా, ఇర్ఫాన్, రాజా, కిశోర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కలువాయి మేజర్ పంచాయతీకి గత ప్రభుత్వం అందించిన రిక్షాబండ్లు, మినీ లారీ ఒక్కరోజు కూడా ఉపయోగించకుండానే వర్షానికి తడిచి. ఎండకు ఎండి తుప్పుపట్టి పోయాయి. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అయిందని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చల్లా విశ్వనాథరెడ్డి ఆరోపించారు. వాటిని వినియోగించకపోయినా కనీసం భద్రపరచని వాటిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)



ఇంత నిర్లక్ష్యమా..!

తుప్పుపట్టిన రిక్షాబండ్లు చూపిస్తున్న చల్లా విశ్వనాథరెడ్డి

ముగ్గురు నిందితుల అరెస్టు

● ఎక్స్‌కవేటర్ స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ తదితరులు

కావలి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌కవేటర్ దొంగతనం కేసులోని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశం లో కావలి సీఐ పాపారావు, అల్లూరు ఎస్‌ఐ కిషోర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. అల్లూరు బలిజపాలెంకు చెందిన బండ్ల మోసెస్‌కు చెందిన ఎక్స్‌కవేటర్‌ను అల్లూరు బలిజపాలెంలో రోడ్డు పక్కన పార్క్ చేశారు. అయితే అక్టోబరు 29న అర్ధరాత్రి దాటాక పార్క్ చేసి ఉన్న ఎక్స్‌కవేటర్‌ను అల్లూరు సాలయ్య శివయ్య, మండలంలోని గౌరవరం శెట్టిపల్లి రఘురామయ్య, దగదర్తి మండలం రామలింగాపురం షేక్ షాజహాన్‌లు తీసుకెళ్లి పొలాల్లో దాచారు. బాధితుడు ఈ విషయంపై అల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. శివయ్య గతంలో ఎక్స్‌కవేటర్‌కి డ్రైవర్‌గా పనిచేస్తూ మానేసి మరలా కోవూరుపల్లి శీనయ్య వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రఘురామయ్య, తనకు పాత పరిచయస్థుడైన షాజహాన్‌తో కలిసి ఎక్స్‌కవేటర్‌ను దొంగలించి తీసుకెళ్లారు. అయితే వారిలో మూడవ నిందితుడు షేక్ షాజహాన్ దానిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ పాపారావుకు వచ్చిన సమాచారం మేరకు శనివారం ఉదయం అరెస్ట్ చేసి విచారించి మిగతా ఇద్దరిని పొలాల్లో అదుపులోకి తీసుకున్నారు. దాచి పెట్టి ఉన్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీన పరుచుకున్నారు. కేసు ఛేదించటంలో చురుకుగా పనిచేసిన కానిస్టేబుళ్ల మాధవ, హేమచంద్‌కు డీఎస్పీ నగదు రివార్డులను అందజేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి వలస కూలీ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోవూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి వలస కూలీ మృతిచెందిన సంఘటన కోవూరు సమీపంలోని కొత్తూరు రోడ్డులో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం కోవూరు పరిసర ప్రాంత గ్రామాలకు వచ్చారు. కోవూరుకు చేరుకున్న బృందంలోని 19 మంది కూలీలు ట్రాక్టర్‌లో వరినాట్లు వేసేందుకు మలిదేవి సమీపంలోని పొలాలకు బయలుదేరారు. కొత్తూరు రోడ్డు డొంకలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి పక్కన ఉన్న కాలువలోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పిల్లివి ప్రాంతానికి చెందిన సునిన్‌సర్దార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 8 మందికి గాయాలయ్యాయి. వారు ప్రభుత్వ వైద్యశాలకు ఆటోల్లో తరలించారు. సర్దార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్‌లు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని మహిళ...



లక్ష్మమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుమన్

కావలి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంక్ రోడ్డులో శనివారం గుడ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన గద్దె లక్ష్మమ్మ(43) లారీ ఢీకొని మృతి చెందింది. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని రవి నర్సింగ్ హోంలో ఆయమ్మగా పని చేస్తున్న ఈమె ఎప్పటిలాగే విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు పొట్టి శ్రీరాములు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా బ్రిడ్జివైపుకు వెళ్లే లారీ ఢీకొ నడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త మాధవ, ఇద్దరు పిల్లలున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు...

నెల్లూరు(క్రైం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బుజబుజనెల్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని మల్లారెడ్డి డాబా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సౌత్‌ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. శ్రీకాకుళంకు చెందిన సింహాచలం కుటుంబం కొన్ని సంవత్సరాల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చి వైఎస్ఆర్ కాలనీలో స్థిరపడ్డారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు కుమారుడు రవి(19) సైతం పనులు చేసుకుంటూ తండ్రికి అండగా ఉంటున్నారు. ఈ నెల 22వ తేది శుక్రవారం రాత్రి రవి తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బైక్‌పై తిరిగి ఇంటికి బయలుదేరి వస్తూ బుజబుజనెల్లూరు పెట్రోలు బంకు వద్ద యూటర్న్ తీసుకుని వెళుతుండగా చెన్నై వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున అటుగా వెళుతున్న వారు 112కు కాల్ చేసి సమాచారం అందించడంతో సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బైక్ నెంబరు ఆధారంగా బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించారు. బాధితుడు తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన రవి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7519
వెండి కిలో ధర	రూ. 93,800
వెండి ఒక గ్రాము	రూ.96.80

● 2013లో సంగంకి ఐటీఐ మంజూరు ● తిరుమనతిప్పలో స్థలం కేటాయింపు
● మంజూరు కాని నిధులు ● ఆత్మకూరు పాలిటెక్నిక్‌లో తరగతులు
● రాకపోకలతో విద్యార్థులపై భారం ● మంత్రి ఆనంపైనే ఆశలు

11ఏళ్లుగా పక్క ఊర్లోనే...

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంకి ఆశ్రమ ఐటీఐ కళాశాల మంజూరై పదకొండేళ్లు గడిచాయి. సొంతభవనం లేక ఆత్మకూరు పాలిటెక్నిక్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం లేక డేస్కాలర్స్‌గా క్లాసులు నిర్వహిస్తున్నారు. దీంతో పేదవిద్యార్థులపై ఆర్థికభారం పడడంతోపాటు వారు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా అటుపాలకులుగానీ ఇటు అధికారులుగానీ ఐటీఐ భవనాల నిర్మాణం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

● ప్రారంభం కాని భవనాలు

2013లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి నియోజకవర్గంలోని పేద విద్యార్థుల కోసం సంగంలో ప్రభుత్వ ఆశ్రమ ఐటీఐని మంజూరు చేశారు. భవన నిర్మాణానికి తిరుమనతిప్పలోని 252 సర్వే నెంబరు 5.7 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నిధులు కూడా మంజూరు చేశారు. భవనాలు నిర్మించే వరకు సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో శిథిలాస్థితిలో ఉన్న మూడు భవనాల్లో తాత్కాలిక తరగతులు ప్రారంభించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గతంలో మంజూరైన నిధులను రద్దు చేసి, కేవలం ఇన్‌స్టిట్యూట్ భవనాలకే నిధులు మంజూరు చేసింది. దీంతో అధికారులు తిరిగి ఆశ్రమ ఐటీఐకి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు.. నిధులు ఆలస్యంగా మంజూరుకావడంతో టెండర్లు పిలిచే క్రమంలో 2019 ఎన్నికలు వచ్చాయి.ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వ రద్దు చేసింది. అ తరువాత ఎవరూ పట్టించుకోలేదు.

● ఆత్మకూరుకి తరలింపు

ఐటీఐ తరగతులు నిర్వహిస్తున్న సంగం ఉన్నత పాఠశాలకు నాడు-నేడు కింద నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఆ శిథిల భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించేందుకు ఐటీఐని ఖాళీ చేయాలని హెచ్‌ఎం సూచించారు. దీంతో 2020లో మంత్రిగా ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి ఐటీఐని ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలకు ఐటీఐని తరలించాలని ఆదే శించారు. దీంతో ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.



సంగంలో ప్రభుత్వ ఐటీఐకి కేటాయించిన స్థలం



స్థలం ఆక్రమణకు గురికాకుండా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

● దేస్కాలర్లకే అవకాశం

ఆశ్రమ ఐటీఐకి పదేళ్లుగా సొంత భవనం లేకపోవడంతో డే స్కాలర్లకే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించి, వసతి కల్పిస్తే నియోజకవర్గంతో పాటు దూరప్రాంతాల పేద విద్యార్థులు ఇక్కడే లాడ్జింగ్, బోడ్డింగ్‌తోపాటు విద్యనభ్యసించే అద్భుత అవకాశం కలుగుతుంది.

● దాత ముందుకు వచ్చినా..

ఐటీఐ భవనాలు నిర్మించేందుకు 2021లో హైదరాబాద్‌కి చెందిన జీఆర్ఎన్ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు గంటా రమణయ్యనాయుడు ముందుకు వచ్చారు. అయితే కళాశాలకు తనపేరు శ్వాశతంగా కాకుండా, పదేళ్లపాటు ఏర్పా టు చేసేందుకు మాత్రమే పరిపాలనా అనుమతులు ఇచ్చారు. దీనికి దాత అంగీకరించలేదు.

● ఆక్రమణలో ఐటీఐ స్థలం

ప్రభుత్వ ఐటీఐకి కేటియించిన స్థలం ఖాళీగా ఉండడంతో ఆక్రమణకు గురవుతుంది. అంతేకాదు ఐటీఐ స్థలంలో కొందరు గ్రావెల్ మాఫియా గ్రావెల్ కోసం రాత్రుల్లో యంత్రాలతో పెద్ద పెద్ద గుంటలు తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. అప్పుడు ఐటీఐని మంజూరు చేయించిన ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలోనూ మంత్రిగా ఉన్నారు. ఈ సారైనా ఐటీఐకి శాశ్వత భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సోమశిలలో 70.809 టీఎంసీల నీరు

అనంతసాగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 5,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.809 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2100, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

27న జిల్లాస్థాయి బాల రంగ్ ఉత్సవ్ : డీఈవో

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఈనెల 27వ తేదీన జిల్లాస్థాయి బాల రంగ్ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మానవ సంగ్రహాలయం, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖల సహకారంతో విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోని భిన్న ప్రాంతాల్లో సాంస్కృతిక విలువలను, జీవన శైలులు జాగృతపరచడం, పిల్లల్లో దాగిఉన్న కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని కళారూపాలైన తప్పెట గుళ్లు, కర్రసాము, చెంచులవేట, థింసా, జాలరి, బంజారా ప్రదర్శించవచ్చన్నారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా 16 మంది విద్యార్థులు పాల్గొనవచ్చని, వారి వెంట ఒక ఎస్కార్ట్ టీచర్ రావచ్చన్నారు. జిల్లా స్థాయిలో ఒక బృందాన్ని ఉత్తమ ప్రదర్శన కింద రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తాము ప్రదర్శించే సంప్రదాయ జానపద నృత్యానికి సంబంధించి క్లుప్త సమాచారాన్ని సమర్పించాలన్నారు. ప్రదర్శన పది నిమిషాలకు మించకూడదని, సంగీతం సహజరంగా ఉండాలని, క్యాసెట్‌లు, సీడీలు వాడకూడదన్నారు. రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ ఈనెల 29వ తేదీన విజయవాడలో జరుగుతందని, జాతీయ పోటీలు డిసెంబరు 21, 22వ తేదీల్లో భోపాల్‌లో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9490639743, 9959138791, 7702001656, 9493235789ను సంప్రదించాలని తెలిపారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి

కోవూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు కోరారు. ఈమేరకు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో పాటూరులో శనివారం కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు గాంధీబొమ్మ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య పెద్దబ్బయ్య, విజయ్‌కుమార్, సురేష్, రమేష్, జానకిరామ్, శివ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాల తనిఖీ



నాటుసారా స్థావరాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పొదలకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొదలకూరు ప్రొహి బిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాటుసారాయి తయారు చేసే ప్రాంతాల్లో ఆ శాఖ అధికారులు డేగ కన్ను వేసి శనివారం తనిఖీలు చేపట్టారు. మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి, కళ్యాణపురం, సూరాయపాలెం, మాముదూరు, చేజర్ల గ్రామాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. ఎక్కడా సారాయి బట్టీలు, సారాయి ఆనవాళ్లు కనబడలేదని పొదలకూరు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పొదలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపుల యజమానులకు ఎక్సైజ్ రూల్స్ ప్రకారం మద్యం అమ్మకాలు చేయాలని, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయకూడదన్నారు. సమయపాలన పాటించాలని, ఎమ్మార్పీ రేట్లకే మద్యం అమ్మకాలు చేయాలనీ సూచించారు. ఈ నెలలో ఇప్పటివరకు పొదలకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 అనధికార మద్యం కేసులు నమోదు చేసి 11మందిని అరెస్టు చేసి 140 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడులలో ఏఈఎస్ జగదీశ్వర్ రెడ్డి, పొదలకూరు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ అంజయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మనుబోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వేకువన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చెర్లోపల్లి సురేంద్రరెడ్డి పెట్రోలు పట్టుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటి వెళుతున్నాడు. బద్దెవోలు మస్తాన్ నెల్లూరు నుంచి మోటార్‌సైకిల్‌పై వేగంగా వస్తున్నాడు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు దాటేందుకు ముందుగానే సురేంద్రరెడ్డి మలుపుతిప్పడంతో వేగంగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొనడంతో రెండు మోటార్‌సైకిళ్లు బోల్తాపడినాయి. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్సులో నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా ఈషా క్రీడోత్సవాలు



ప్రత్యేక వేషధారణలో చిన్నారులతో నిర్వాహకులు

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గ్రామోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను బుచ్చి సీఐ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేసేం దుకు, గ్రామీణ ప్రజల్లో ఉత్సాహం నింపేం దుకు గ్రామోత్సవం కార్యక్ర మాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామీణ ప్రజల క్రీడా ప్రతిభను వెలికితీయడం శుభ పరిణామమన్నారు. దీనివల్ల ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని, అందరిలో క్రీడాస్ఫూర్తి పెరుగుతుందన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. అలాగే చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో మొత్తం 24 వాలీబాల్ జట్లు తలపడ్డాయి. ఆదివారం వాలీబాల్‌తో పాటు మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ వలంటీర్లు బ్రహ్మానాయుడు, గణేష్, వరుణ్, మాధవ్, గిరి, శైలజ, వాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగారూ.. స్పందించండి



కొండబిట్రగుంట ప్రధాన రోడ్డులో వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిలుస్తుందని అవి బయటకు వెళ్లే చర్యలు అధికారులు తీసుకోక పోవడం లేదు. రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పదేళ్ల పాలనలో రోడ్డు అభివృద్ధి విషయం మరిచారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సారు మీరైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

గుంత కనిపించదా సార్..

కావలిలోని మానస థియేటర్, లతాథియేటర్‌ల మధ్య రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. ఈ గుంత పడి ఆరు నెలలకు పైగా అవుతున్నా, పలువురు ప్రమాదాల బారినపడినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

-కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి)



కుళాయి నీరు వృథా..

స్థానిక సాయి ఫిల్లింగ్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న కుళాయి పైపు పగిలి పోవడంతో నీరు వృథాగా పోతుంది. రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలుగుతుంది. నాలుగు రోజుల కిందట కుళాయి పైపును లారీ తొక్కడంతో ఈ సమస్య నెలకొందని అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)



పట్టుమని పదిమంది నివాసం లేరు!

● పూర్తైన ఇళ్లు 91..
నివాసముంటున్నది 8మంది

● 17జగనన్న లేఅవుట్ల ఖర్చు రూ.1.80 కోట్లు

● అధికారులు, గుత్తేదారులకు కాసుల వర్షం

లింగసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న లేఅవుట్లలో నేడు పట్టుమని పదిమంది కూడా నివాసం ఉండటం లేదు. ఈ లేఅవుట్లు పిచ్చి మొక్కలు, ముళ్లకంపలతో నిండి అడవులను తలపిస్తున్నాయి. మండలంలోని 16పంచాయతీలలో 17జగనన్న లేఅవుట్లను నిర్మించారు. అందుకోసం ఉపాధిహామీ నిధులు సుమారు రూ.1.80 కోట్లు ఖర్చు చేశారు. ఈ లేఅవుట్లలోనే నవరత్నాల పథకం కింద రెండవవిడతలో 587పక్కాగృహాలు మంజూరయ్యాయి. వీటిలో యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-2, చినపవని, పెదపవని గ్రామాలకు 293 గృహాలు మంజూరయ్యాయి. ఇందులో కేవలం 91గృహాలను లబ్ధిదారులు నిర్మించుకున్నారు. మరో 81గృహాలు వివిధ దశల లో నిర్మాణంలో ఉన్నాయి. అయితే ఈ నాలుగు లేఅవుట్లలో పెదపవనిలో నలుగురు, చినపవనిలో ఒకరు, యర్రారెడ్డిపాలెంలో ముగ్గురు చొప్పున మొత్తం 8మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. మిగిలిన 415 పక్కాగృహాల నిర్మాణాల ఊసేలేదు.

ఆసక్తి చూపని లబ్ధిదారులు

లేఅవుట్లలో పక్కా గృహాలను నిర్మించుకొనేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. లేఅవుట్లలో పక్కా గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించి రూ.ఒక్కో గృహానికి రూ.1.80లక్షలు మాత్రమే మంజూరు చేశారు. లేఅవుట్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో చాలామంది నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు.

మట్టిలో పోసినట్లుగా రూ.1.80 కోట్లు


17 జగనన్న లేఅవుట్లకు రూ.1.80 కోట్లు అధికారులు ఖర్చు చేస్తే కేవలం 8 మంది మాత్రమే నివాసం ఉండటంతో నిధులు మట్టిలో పోసినట్లైంది. ఈ లేఅవుట్ల ఏర్పాటు అటు అధికారులు ఇటు గుత్తేదారులకు కాసుల వర్షం కురిపించిందని విమర్శలు ఉన్నాయి.



జంగంరెడ్డిపాలెంలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం

అధిక యూరియా.. అనర్థదాయకం

● శ్రీహరి, వ్యవసాయాధికారి, సంగం



సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో అధిక యూరియా వాడకం అనర్థదాయకం అని, సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి శ్రీహరి సూచించారు.

? రబీ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో ఏ రకం.. వరి వంగడాలు సాగవుతుంది. .

! మండలంలో 12వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ఇప్పటికే 1,300ఎకరాల్లో నాట్లు వేశారు. నెలాఖరు.. డిసెంబరు మొదటివారంలో నాట్లు పూర్తవుతాయి. 135 నుంచి 140 రోజుల్లో కోతకు వచ్చే స్వల్పకాల రకాలను సాగు చేస్తున్నారు.

? రైతుసేవా కేంద్రాల్లో కావలసిన ఎరువులున్నాయా.

! రైతులు ముందుగా నగదు చెల్లిస్తే రైతుసేవా కేంద్రాల ద్వారా తెప్పించి ఒకటి, రెండు రోజుల్లో అందచేస్తున్నాం. ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అరువుకు తీసుకుంటున్నారు.

? ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేస్తే ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. అధిక ధరకు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

? దిగుబడులు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మంగళ, బుధవారాలలో రెండు గ్రామాల పొలాలను పరిశీలించి సస్యరక్షణ, అధిక దిగుబడి సాధనకు కృషి చేస్తున్నాం.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

కావలి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చలంచర్ల పంచాయతీ పేపాలవారిపాలెంలో శనివారం సాయంత్రం రెండు బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో మద్యం అమ్ముతున్న మొగిలిగుండ్ల మాల్యాద్రి, ఎర్రజొన్న కళ్యాణ్‌ను అదుపులోకి తీసుకుని 18 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

శుద్ధిజల కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

ఉదయగిరి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం శుద్ధిజల కేంద్రం ఏర్పాటుకు ఎంపీడీవో అప్పాజీ గ్రామస్థులతో కలిసి స్థల పరిశీలన చేశారు. శుద్ధిజల కేంద్రం ఏర్పాటుచేసి కాలనీ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి భాస్కర్, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవపాళెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠనా, అభ్యసనాల్లో వారి ప్రగతిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేసి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాగర్జనకు తరలిరండి

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నియోజకవర్గ మాల మహానాడు మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న మాలల మహగర్జన బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుండి భారీగా ప్రజలు తరలిరావాలని సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యల్లో సరిహద్దు గ్రామాలు




కంపచెట్లతో నిండిన పేపాలవారిపాలెం ఎస్టీ కాలనీ రోడ్డు

కావలి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేపాలవారిపాలెం, పెద్దారం, లక్ష్మీపురం, బట్లదిన్నె, జువ్విగుంటపాలెం సీతారామనగరం గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చలంచర్ల పంచాయతీ పేపాలవారి పాలెం వెళ్లేందుకు జాతీయ రహదారి నుండి లక్ష్మీపురం వరకు ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేపాలవారి పాలెం, లక్ష్మీపురం వాసులు చెబుతున్నారు. అలాగే పేపాలవారిపాలెం ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డులో కంప, చిల్లచెట్ల మధ్య వెళుతున్నారు. అలాగే చలంచర్ల సచివాలయానికి వెళ్లాలంటే రోడ్డు లేకపోవటంతో 2కిలో మీటర్లదూరం కాలి నడకన లేక మోటారు బైక్‌లపై వెళుతున్నారు. చలంచర్ల నుండి పెద్దారం వెళ్లాలంటే 3కిలో మీటర్లు గుంతలు ఉన్న మట్టి రోడ్డులోనే ప్రయాణిస్తున్నారు. ఈ గ్రామం నుండి చలంచర్ల, కావలి పట్టణానికి రావాలంటే ద్విచక్ర వాహనాలే దిక్కు. జాతీయ రహదారికి 2కిలోమీటర్ల దూరం లోని బట్లదిన్నె, జువ్విగుంటపాలెం, సీతారామనగరం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు.

పాఠశాలలు శిథిలమైనా తొలగించరా?

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోకూరు, గాంధీనగర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలను తొలగించాలని గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గరుకుపాలెంలో పాఠశాల భవనం

కావలి కాలువలో పూడికతీత ప్రారంభం

బిట్రగుంట, నవంబరు (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చెన్నూరు సమీపంలోని కావలి కాలువ పూడికతీత పనులను శనివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి స్థానిక టీడీపీ నేతలు, రైతులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలి కాలువలో తట్ట మట్టి ఎత్తలేదన్నారు. 900 క్యూసెక్కుల నీటి లభ్యత ఉండాల్సిన కాలువలో 500 క్యూసెక్కులు నీరు సరఫరా కావడం లేదన్నారు. కాలువ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అంతర్ కళాశాలల పోటీలకు తరలిన విద్యార్థులు

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండవ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు శనివారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే అంతర్ కళాశాలల ఆటల పోటీలకు తరలివెళ్లారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నైరా వ్యవసాయ కళాశాలలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే కాలేజ్ స్పోర్ట్స్ గేమ్స్ అండ్ కల్చర్ మీట్‌కు కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

బీజేపీ నాయకుల సంబరాలు

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించటంపై స్థానిక పార్టీ శ్రేణులు శనివారం కందుకూరులో సంబరాలు చేసుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, నాయకులు, చుండి మురళీధర్, బొర్రా కోటేశ్వరరావు, అమలనాథుని మాల్యాద్రినాయుడు, చిన్నిపాండురంగయ్య, మువ్వల భూషయ్య, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



కందుకూరు: మిఠాయిలు పంచుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీ విజయోత్సవం

కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేయడంతో స్థానిక బీజేపీ నేతలు శనివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, నేతలు, కార్యకర్తలకు మిఠాయిలు తినిపించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నేతలు అమరా సుబ్బారావు, బ్రహ్మానందం, సీవీసీ సత్యం, మాల్యాద్రి, కిరణ్ పాల్గొన్నారు.

తాళ్లూరి కుటుంబసభ్యులకు మంత్రి, ఎమ్మెల్యేల పరామర్శ

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ తాళ్లూరి రమణయ్యనాయుడుకు టుంబసభ్యులను శనివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. తాళ్లూరి చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు, ఏపీ సివిల్ సప్లైస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి రమణయ్యనాయుడుకు నివాళులర్పించారు. చివరిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బొల్లినేని కృష్ణమనాయుడు, కొమ్మిలక్ష్మీనాయుడు పరామర్శించారు.



తాళ్లూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

గండిపాలెం సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా మహిళా భక్తులు వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు నిర్వహించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉసిరిక చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేశారు.



ఉదయగిరి: స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేపు సహస్ర జ్యోతిర్లింగార్చన

శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా మహాభస్మాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన సహిత జ్వాలతోరణ కార్యక్రమం జరుగుతుందని శనివారం నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

సంగం, నవంబరు 23: స్థానిక సంగమేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి సకల ద్రవ్య, క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పద్దెనిమిది మెట్లకు కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మాఘం గిరిబాబు, సుధా, గ్రామపెద్దలు కర్నాటి రవీంద్ర రెడ్డి, శ్రీరామ్, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనం శిథిలంపై సభ్యుల ఆందోళన

జలదంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన శనివారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రి పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై పలు అంశాలపై చర్చించారు. నూతన భవనం నిర్మాణాన్ని రెండేళ్ల కిందట కాంట్రాక్టర్ నిలిపేయడంపై చర్చ కొనసాగించారు. నూతన భవనంలోని గదులు కనీసం శుభ్రం చేయడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ అహ్మద్‌బాషాను ఎంపీపీ ఫోనులో సంప్రదించి నూతన భవనం దుస్థితిపై వివరణ కోరారు. అవసరమైతే కాంట్రాక్టరును మార్చి పనులు పూర్తిచేయించలాని సూచించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఏఈ తెలిపారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, వైద్యాధికారి

దేవుడి చిత్రపటాలు తగులపెట్టిన వ్యక్తి అరెస్టు

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట, తాళ్ళూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని శ్రీవారి నిజపాదాల వద్ద స్వామివారి చిత్రపటాలను తగులపెట్టిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై భోజ్య తెలిపారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం శ్రీవారి నిజపాదాల గుడిలో స్వామివారి చిత్రపటాలు తగులపెట్టిన కేసు విచారణలో భాగంగా కొండబిట్రగుంటకు చెందిన కట్ట పకీరయ్యగా తేలిందని ఎస్‌ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కొండబిట్రగుంటకు చెందిన కొందరు పశువుల కాపరులు పకీరయ్య గుడి ప్రాంతంలో తిరుగుతున్నాడని చెప్పారు. ఇంటికి వెళ్లమని మందలించినా వెళ్లకుండా గుడి వద్ద మంట పెట్టాడన్నారు. ఇది వరకు ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ రథం తగలపెట్టిన కేసులో పకీరయ్యను అరెస్టు చేశారని తెలిపారు.

26న మహాధర్నాను జయప్రదం చేయండి

ఆత్మకూరు, నవంబరు 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 26 తేదీన స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు జీవి శివప్రసాద్ కోరారు. స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవన్‌లో సీఐటీయు, రైతు సంఘాల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీన రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యమై హక్కుల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, జిల్లా కౌలురైతు సంఘం నాయకుడు లక్ష్మీ పతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, రాధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు, కౌలురైతు సంఘం నాయకులు

న్యూస్ బాక్స్

అల్లూరు యువకుడికి ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవాపురస్కారం అందుకుంటున్న పేట రాఘవయ్య

అల్లూరు, నవంబరు 23: స్థానిక పేట రాఘవయ్య అలియాస్ బాబాయ్‌కు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామరాజు చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. నెల్లూరులోని రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం (టౌన్‌హాల్)లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను చేసిన సేవకు ఇంతటి గుర్తింపు లభిస్తుందని అనుకోలేదని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయన అభిమానులు పాల్గొన్నారు.

కచ్చిత సమాచారమివ్వాలి

కలిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ సర్వేలో ప్రతిఒక్కరూ కచ్చితమైన సమాచారం అందించాలని ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. శనివారం స్థానిక ముస్తాపురంలో జరుగుతున్న ఈ సర్వేను ఆమె పరిశీలించారు. సర్వే కోసం వచ్చిన సిబ్బందికి ఆయా కుంటుంబ యజమాని లేదా సభ్యులకు పూర్తి సమాచారం అందిచాలన్నారు. ఆయా ప్రాంతాలను బట్టి ప్రజల అవసరాలను తీర్చడానికి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.


బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాత వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. తక్కువ వయసులో వివాహం చేస్తే అనారోగ్యం సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాల్‌జాన్సన్ ఉపాధ్యాయులు రవికుమార్, రేష్మ, శిరోమణి, శిరీషా, పద్మ నయోమి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

కావలి టౌన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్ శంకరన్ సెమినార్ హాల్‌లో శనివారం జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు శనివారం విపత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు రాజీవ్ దరిపా, సందీప్ కుమార్ రెడ్డిలు తుఫానులు, భూపంకం, అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించారు. కాలేజి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ మాల్యాద్రి, విశ్వోదయా రెక్టార్ డొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



కావలిటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రాఘవేంద్రకాలనీలోని ట్రంకురోడ్డు వద్ద నున్న అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి గజ వాహనంపై అయ్యప్ప, వినాయక, సుబ్రమణ్యేశ్వర స్వామిల గ్రామోత్సంను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని గ్రామోత్సవం ముందు జ్యోతులు పట్టుకుని అయ్యప్ప నామజపం చేస్తూ ముందుకు సాగారు.

బాల్య వివాహాలపై అవగాహన

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంగమూరు పంచాయతీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై తల్లులు, కిశోర బాలికలకు శనివారం సీడీపీవో సౌజన్య అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల అరికట్టడంపై తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లలితమ్మ, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీ, అంగన్వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి ఉన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయవద్దు : కత్తి

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, దీన్ని వెంటనే ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్‌ను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రతి ఇంటిలో ఉన్న పాత కరెంటు మీటరు స్థానంలో సిమ్‌కార్డు అమర్చి ఉన్న ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ బిగించి తీవ్ర గుదిబండ మోపనున్నారని తెలిపారు. దీనివల్ల రైతులు, నిరుపేదలు, చిన్నతరహా పరిశ్రమలు దివాలా తీసే పరిస్థితి వస్తుందన్నారు. సీపీఎం నేత నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎం పార్టీ మరో విద్యుత్ ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని తెలియచేశారు. ఈ సమావేశంలో నేతలు సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, బీపీ నరసింహా, అల్లంపాటి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పెంచలస్వామి కల్యాణం

రాపూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో స్వామివారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం 4గంటలకు స్వామివారికి అభిషేకం, 10.30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5.30గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామికి తిరుచ్చి పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ సేవ (ఊంజల్‌సేవ) వైభవంగా నిర్వహించారు. భక్తులకు మంచినీరు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

వేడుకగా బాలల దినోత్సవం

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పురమందిరంలో శ్రీనేతాజీ ఎంఎస్ఆర్ పైలట్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఎంవీ.నేతాజీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ జీవీఎస్.సుధ, వైస్‌ప్రిన్సిపాల్ కె.స్పందన, హెచ్ఎం ఎస్‌వీ ఎల్. నరసింహారావు, ఎం.రమాదేవి, ఏవో చెంచయ్య, అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీధర్, గౌరవాధ్యక్షుడు రవీంద్రరెడ్డి, కార్య దర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, ఎన్.బల రామయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని చిన్నబాలయ్య నగరపాలక పాఠశాల, ఆర్ఎస్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలల్లోని ఎన్‌సీసీ కేడెట్స్ శనివారం నగరంలోని నవాబుపేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ బాబు, జాస్మినమ్మ, ఆర్మీస్టాఫ్ జస్పాల్‌రానా, ఎన్‌సీసీ అధికారులు కె.బాలబ్రహ్మాచారి, ఎం.చిన్నయ్య పాల్గొన్నారు.

'నుడా' సమగ్రాభివృద్ధే లక్ష్యం : కోటంరెడ్డి

● వైభవంగా మహారుద్రాభిషేకం


మహాశివలింగానికి పూజలు చేస్తున్న కోటంరెడ్డి దంపతులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంతో పాటు జిల్లా అంతా నుడా ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నుడా చైర్మన్‌గా నియమితులైన తనపై ఉందని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం బాలాజీనగర్‌లోని త్యాగరాజ స్వామి కళ్యాణ మండపంలో సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో కార్తీక మాస మహారుద్రాభిషేకం వైభవంగా జరిగింది. 5 అడుగుల మహాశివలింగానికి భక్తులే స్వయంగా అభిషేకాలు చేశారు. కుర్తాళం పీఠం ఆస్థాన అర్చకులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మహా న్యాసాలు చేశారు. మరొకవైపు సంవత్సరకాలం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కోసం 365 సూక్ష్మ మృతికా లింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. భక్తులకు. పంచామృత తీర్థం, శ్రీశైలం మల్లికార్జున స్వామి లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి తన సతీమణి సంధ్యతో కలసి పాల్గొని మాట్లాడుతూ మహా శివుడి అనుగ్రహం, నందమూరి బాలకృష్ణ, మంత్రి పొంగూరి నారాయణ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో 2014-19లో నుడా చైర్మన్‌గా ఎన్నికై నెల్లూరు గ్రామదేవత ఆలయం వద్ద ఘాట్ నిర్మించి, ఎంతో అందంగా తీర్చిదిద్ది ఐలవ్‌యూ నెల్లూరు అనే బోర్డును ఏర్పాటు చేశామన్నారు. అలాగే బాలాజీనగర్‌లో మహిళల కోసం ప్రత్యేక పార్కు, మరొక పార్కులకు శంకుస్థాపనలు చేశామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో నెల్లూరు తూర్పు ప్రాంతంలో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ, మినరల్, వాటర్ పైపులైన్లు వేశామన్నారు. 2019లో తమ ప్రభుత్వం ఓడిపోవడంతో గత ఐదేళ్ల అభివృద్ధి పనులు ఆగిపోవడమేకాక వాటి రూపురేఖలు మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీ అందరి ఆశీస్సులతో తిరిగి నుడా చైర్మన్‌గా ఎన్నికయ్యానని, త్వరలో ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డు నిలిచిపోయి పార్కులను సుందరీకరణ చేపట్టబోతున్నామన్నారు. కాగా కార్యక్రమ నిర్వాహకుడు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ జన్మదినం కావడంతో అందరు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, అంచూరు జానకీ, కప్పిర శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి 99వ జయంతి


సత్యసాయి సేవా పురస్కారం అందుకుంటున్న మాధవి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి 99వ జయంతి వేడుకలు పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనం (టౌనుహాలు)లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి సేవా పురస్కార గ్రహీతలు ఉచ్చి రాజశేఖర్, మాగుంట వెంకటరంగారెడ్డి, శ్రీమంతుల హరనాథ్, పేట రాఘవయ్య (బాబాయ్), నగరంలోని డ్రైవర్స్ కాలనీలో గల వరపరివార్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సంకరాపు మాధవిలను మెమొంటో, సత్యసాయి చిత్రపటం, మెడల్, శాలువా, కిరీటధారణతో ఘనంగా సత్కరించారు. ముందుగా బాబా చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, ఆయుర్వేద వైద్యుడు కె.శ్యాందన్, కె.కృష్ణారెడ్డి, అందే శ్రీనివాసులు, కె.మురళీమోహన్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, నాట్యగురు జ్యోత్స్న, సుధాకర్, బుజ్జయ్య, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎనెల్ ఆసుపత్రిలో ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కీళ్ళ, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సామాట్ మాట్లాడారు. బద్వేలుకు చెందిన ప్రశాంతి అనే బాధితురాలు కొంత కాలంగా మణికట్టు నొప్పితో తీవ్రంగా బాధపడేదన్నారు. ఎక్కడకు వెళ్లినా వ్యాధి నయం కాక పోవటంతో ఎనెల్ ఆసుపత్రికి వచ్చారన్నారు. ఇక్కడ అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా అన్‌సోకార్‌పాల్ అబ్యుట్‌మెంట్ సిండ్రోమ్‌గా గుర్తించామన్నారు. వెంటనే ఆధునాతన శస్త్రచికిత్స విజయవం తంగా నిర్వహించామని చెప్పారు. దీంతో బాధితురాలు కోలుకుంటుందని వెల్లడించారు. మణికట్టు, మోచేయి నొప్పితో బాధపడేవారు తప్పకుండా వైద్య నిపుణులను కలవాలని తెలియచేశారు.


డాక్టర్‌తో బాధితురాలు ప్రశాంతి

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా


బాధితుడికి చెక్కు అందచేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద, నిరుపేద కుటుంబాలలోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆర్థిక భరోసా కలుగుతుందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని ఐదు కుటుంబాలకు రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే డిజిటలైజేషన్

● నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి సుధాభారతి



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని సహకార సంఘాల్లో జవాబుదారీ తనం కొరవడి నిధుల దుర్వినియోగం అవుతోన్నాయి. సంఘంలో సభ్యుడు చనిపోయాడా, బతికున్నాడా? అనే విషయాలు కూడా కొన్ని సహకార సంఘాల రికార్డుల్లో లేవు. బినామీల పేరుతో రుణాల పరంపర కూడా కొనసాగింది. కొన్ని సహకార సంఘాలు విచ్చలవిడిగా నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో అవి దివాలా స్థాయికి చేరుకున్నాయి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల డిజిటలైజేషన్ (కంప్యూటరీకరణ) కు పూనుకుంది. ఈ ప్రక్రియ పారదర్శకత కోసమేనని నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి బాలిరెడ్డి సుధాభారతి తెలిపారు.

ఈ తరుణం...

? సహకార సంఘాల డిజిటలైజేషన్ వలన ప్రయోజ నం ఏమిటి.

! సహకార సంఘాల డిజిటలైజేషన్‌తో పారదర్శకత ఏర్పడుతోంది. ప్రతి పైసాకు జవా బుదారీతనం ఉంటుంది. ఖాతాదారు ఎప్పుడైనా తన ఖాతాలోని నగదు, రుణ వివరాలు తెలుసుకోడానికి వీలుంటుంది.

? జాతీయ బ్యాంకులతో సమానంగా సేవలు అందుతాయా.

! సహకార సంఘాల ద్వారా జాతీయ బ్యాంకులతో సమానమైన సేవలు అందించడానికి డిజిటలైజేషన్ దోహదపడుతోంది. సాంకేతికతను ఉపయోగించడం ద్వారా పీఏసీఎస్‌లను సమర్థవంతంగా నిర్వహించవచ్చు.

? పీఏసీఎస్‌లు ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీలవుతుందా.

! డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా పీఏసీఎస్‌లను నాబార్డుతో అనుసందానిస్తారు. దీంతో పీఏసీఎస్‌లు ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు నిర్వహించడానికి, నాబార్డు నుంచి రుణాలు పొందేందుకు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుంటాయి.

? నెల్లూరు డివిజన్‌లో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో ఎం త మంది సభ్యులు ఉంటారు. సభ్యుడు చని పోతే ఏమి చేయాలి.

! డివిజన్‌లో 24 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 18 సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన సంఘాల్లో ఈనెలాఖరుకు పూర్తి చేస్తాం. ఒక్కో సంఘంలో 2 వేల నుంచి 10వేల మంది సభ్యులు ఉంటారు. సహకార సంఘంలో సభ్యుడు చనిపోతే నామినీని సభ్యుడుగా చేయవచ్చు. సహకార సంఘంలో సభ్యుడు కనిపించకపోతే డిజిటలైజేషన్ ప్రక్రియలో అతని వివరాలు హోల్డ్‌లో పెడతారు. అతను వచ్చిన తరువాత వివరాలు నమోదు చేసే అవకాశం ఉంది.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసలు

వెంకటాచలం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ప్రశంసించారు. ఇటీవల మహారాష్ట్రలోని జలగోన్‌లోని కేబీఎస్ నార్త్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌లో పాల్గొన్న వాలంటీర్లు ప్రసాద్, తేజస్వి, రమ్యలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఎన్ఎస్ఎస్ కోఆర్డీనేటర్ డాక్టర్ అల్లం ఉదయశంకర్, టీ భారతీ తదితరులున్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారంటూ శనివారం బాధితుడు శ్రీరామ్ మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటాచలం పంచాయతీ వడ్డీపాళెం గ్రామానికి చెందిన తురక లక్ష్మమ్మ, తురక భవాని లిద్దరూ కలిసి తన పొలాల్లోకి అక్రమంగా చొరబడి ఆక్రమించడానికి ప్రయత్నించగా తాను అక్కడికి వెళ్లి ప్రశ్నించడంతో తనతో గొడవ పడి అసభ్య పదజాలంతో దూషించి చేతులు, కాళ్లతో తనను కొట్టారని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం రైతులు, వృత్తిదారులు, మహిళలు పోరాటాలకు సిద్ధంకావాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 26న నెల్లూరులో నిర్వహించే ధర్నాను జిల్లాలో రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు కార్తీక మాస దీపోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం కార్తీక దీపోత్సవం శ్రీపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. 1008 పుట్టమట్టితో చేసిన శివలింగాలకు లింగార్చన కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు.

సురేంద్రబాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

● డీఎంహెచ్‌వోకి వినతి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పడారుపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గండికోట సురేంద్రబాబు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యకు వినతిపత్రం అందజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఔట్‌సోర్సింగ్ కావడంతో బాధితుడి కుటుంబా న్ని ఆదుకునేందుకు మృతుడి భార్యకు తాత్కాలిక ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజురుల్లా, మురళి, నాగరాజు, సాయికార్తీక్, తిరుపతయ్య, కళ్యాణ్, ఉషా, ఆల్ఫ్రెడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శివ పంచాక్షరీ సప్తాహం ప్రారంభం


మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేస్తున్న రూప్‌కుమార్‌యాదవ్, గిరీష్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో శివపంచాక్షరీ నామ స్మరణలు భగవంతుని కృపకు పాత్రమైంది. ఈ కార్యక్రమం శనివారం మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ప్రారంభమైంది. ఆలయ మాజీ చైర్మన్, ఏఎంఆర్ గ్రూపు అధినేత ఆల్తూరు గిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించి అనంతరం అఖండ శివనామ భజనలు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, మేకల నరేంద్ర రెడ్డి, కేవీఆర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ ఈవో జె.శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా ప్రాకారోత్సవం

నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో శనివారం రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవారికి విశేష అలంకారం, సాయంత్రం పూలంగిసేవ జరిగింది.

పుస్తకమిత్ర గ్రంథాలయం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఎస్ఆర్ఐ వాసవి అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన పుస్తకమిత్ర గ్రంథాలయాన్ని ఎంఈవో ఎం దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలతో తల్లిదండ్రులు నీతి కథలు, దేశభక్తి విలువలు పెంపొందించే పుస్తకాలను చదివించాలన్నారు. పుస్తకమిత్ర గ్రంథాలయం ఏర్పాటు కు సహకరించిన వాసవి అసోసియేషన్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ మాల్యాద్రిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేదవతి, ని ర్మల, వేణు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


పుస్తకాలు ప్రదర్శిస్తున్న ఎంఈఓ, తదితరులు

పెడదోవ పడుతున్న యువతను కాపాడండి

నెల్లూరు(క్రైం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): న్యూడ్ వీడియో కాల్స్, హనీ ట్రాప్, ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా పెడదోవ పడుతున్న యువతను కాపాడాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ యువతను ఉద్రేకపరుస్తూ అనేక యాప్స్ ద్వారా న్యూడ్ కాల్స్‌తో నగ్న వీడియోలు రికార్డ్ చేస్తూ యువతను బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వారు అడిగినంత నగదు ఇవ్వకపోతే ఆ వీడియోలను తెలిసిన వారికి పంపుతున్నారని, దీని ద్వారా అనేక మంది యువత మానసిక వేదన పడుతూ చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అయ్యప్ప గుడిలో మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామికి కేరళ సాంప్రదాయ కార్తీక మాస మండల పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలు, ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, పావలా ప్రసాద్, పలువురు అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

● అడిషనల్ డీపీఎం మునిరత్నం


ప్రకృతి సాగుపై పరిశీలనలో డీపీఎం మునిరత్నం

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి సారించాలని అడిషనల్ డీపీఎం మునిరత్నం సూచించారు. ఈదగాలి గ్రామంలో శనివారం ఈ సాగుపై నిర్వహించిన శిక్షణలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని సూచనలు, సలహాలిచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చన్నారు. ఒకే పొలంలో ఒకే కాలంలో 5రకాల పంటలతో 5రెట్లు ఆదాయం తీయవచ్చన్నారు. అనంతరం బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికలు తయారు చేశారు. కార్యక్రమంలో పీఈ కోటేశ్వరరావు, శంకర్, ఎంటీలు సునీత, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలను బుచ్చిలోని సుహాసినీ నగర్‌కు చెందిన సత్యసాయి భక్తుడు పోలిశెట్టి వినోద్‌బాబు శనివారం నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, చీరలు, బియ్యం పంపిణీచేసి భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీసాయి హృదయ్‌లో భజన కార్యక్రమం నిర్వహించారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు

మనుబోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి శని, ఆది వారాల్లో కచ్చితంగా బీఎల్‌వోలు కేంద్రాలు నడపాలని సీఈవో కార్యాలయ ఏఎస్‌వో (అసిస్టెంట్ సెక్షన్ అధికారి) వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్న కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్‌వోలదే అన్నారు. వచ్చిన దరఖాస్తులను కార్యాలయ అధికారులకు పంపాలన్నారు. వీఆర్‌వోలు శ్రీనువాసులు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నేతకు నివాళి

తోటపల్లిగూడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత దివంగత టంగుటూరు శ్రీనివాసులరెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. బంధుమిత్రులు శ్రేయోభిలాషులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పాల్గొన్న వారిలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, మాజీ సహకార బ్యాంక్ చైర్మన్ కోడూరు శ్రీనివాసులరెడ్డి (చిన్నబాబిరెడ్డి) బాబునాయుడు, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, చిరంజీవిగౌడ్, గుడ్లూరు వెంకయ్యనాయుడు, గడ్డె కిషోర్, తదితర ప్రముఖులు ఉన్నారు.




పక్షుల పుటిటిల్లు కళకళ!

ఎగురుతూ.. వాలుతూ.. ఈదులాడుతూ.. వేటకెళ్తూ.. ముక్కున చేపను కరుచుకుని తెస్తూ.. గూటి కోసం పుల్లలు ఏరుకొస్తూ.. కొమ్మలపై గూడు అల్లుకుంటూ.. నేలపట్టు పక్షుల కేంద్రం సందడిగా మారింది. అక్టోబరు నుంచే మొదలైన విదేశీ విహంగాల రాక నవంబరు ఆఖరుకు భారీగా పెరిగింది. వేల కిలోమీటర్ల నుంచి ఎగిరొచ్చిన ఈ పక్షులు.. ఇక్కడే జంటను వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లల్ని చేసి పెంచుతాయి. ఫిబ్రవరి నుంచి మే నెలదాకా రెక్కలొచ్చిన పిల్లల్తో కలిసి తిరుగు ప్రయాణాలు మొదలు పెడతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు దేశాలు దాటి వెళ్లిపోయినా, మరుసటి ఏడాది సరిగ్గా నేలపట్టుకే వచ్చి వాలుతాయి. విదేశీ అతిథి పక్షులతో కళకళలాడుతున్న నేలపట్టు సందర్శకులకు కనువిందుగా మారింది. **ఆలస్యం ఎందుకూ.. మీరూ ఈ అందాలు ఆస్వాదించండి!**

6లో







భక్తుల అభిప్రాయం మేరకే

తిరుమల అభివృద్ధి

ఇందుకోసం ప్రత్యేక ఐటీ వ్యవస్థ ఏర్పాటు

తిరుమల కోసం విజన్ డాక్యుమెంట్

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల అభిప్రాయాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు ఒక వ్యవస్థనే ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. రవాణా, వసతి, దర్శనం, లడ్డూ, అన్నప్రసాదాలు వంటి వాటి గురించి భక్తులను కలిసి అభిప్రాయాలు సేకరించేందుకు ఐటీ విభాగం కింద టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. సేకరించిన అభిప్రాయాలను విశ్లేషించి సేవలను మెరుగుపరచుకుంటామని ఈవో చెప్పారు. ఈ వ్యవస్థ ఏర్పాటు గురించి ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నిపుణులు పరిశీలన చేస్తున్నారని తెలిపారు. తిరుమల పవిత్రత విషయంలోనూ, భక్తులకు సేవల విషయంలోనూ రాజీపడరాదని సీఎం చంద్రబాబు కఠినమైన ఆదేశాలిచ్చిన నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మరిన్ని అంశాలపై ఈవో శ్యామలరావు అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

ముఖ ఆధారిత వ్యవస్థ

తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నాం. టికెట్ బుక్ చేసుకున్న భక్తులే దర్శనానికి వచ్చారా లేక ఇతరులు వచ్చారా అన్నది ఇందువల్ల గుర్తించడానికి వీలవుతుంది. ఇప్పటిదాకా శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్యను ఖచ్చితంగా లెక్కించే పరిస్థితి లేదు. అంచనా వేసి చెప్పడమే జరుగుతోంది. ముఖ ఆధారిత వ్యవస్థ ఖచ్చితమైన లెక్క వస్తుంది. అలాగే సెక్యూరిటీ కోణంలో కూడా ఉపయోగపడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అందించే సంస్థల కోసం టెండర్లు పిలిచాం. అలాగే ఆధార్ ఐడెంటిఫికేషన్ కోసం ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్రం నుంచీ అనుమతి రావాల్సి వుంది.

టీటీడీ ఆర్థికాంశాలపై స్టాఫ్ కాలేజీ అధ్యయనం

నిరంతరం ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిరాటంకంగా నడవాలంటే దేవస్థానానికి ఆర్థిక సుస్థిరత ఉండాలి. అదే సమయంలో పారదర్శకత మరింత అవసరం. భక్తులు సమర్పించే ప్రతి రూపాయీ ఎక్కడికి వెళుతోంది? దేనికి ఖర్చవుతోంది? అనేది అందరికీ తెలియాలి. అనవసర వ్యయం తగ్గించుకోవాలి. ఉద్యోగుల వేతనాలకు టీటీడీ వార్షికాదాయంలో 64 శాతం ఖర్చు అవుతోంది. 2014-15లో ఇది 45 శాతం మాత్రమే. దీనిపై ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నిపుణుల ద్వారా అధ్యయనం చేయిస్తున్నాం. ఖర్చును నియంత్రించాల్సిన అవసరముంది.

పేరుకుపోతున్న చెత్తపై నిపుణుల అధ్యయనం

తిరుమలలో వాహన కాలుష్యం అధికంగా వుంది. దశలవారీగా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. తిరుమలలో రోజుకు 70 టన్నుల చెత్త పేరుకుంటోంది. దాన్ని రోజువారీ కిందకు తరలించడానికి వీలు కాదు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఐఏహెచ్ఎస్ నుంచీ నిపుణులు వచ్చి అధ్యయనం చేశారు. వారం రోజుల్లో వారి నుంచీ నివేదిక అందనుంది. దానికనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

"సనాతన ధర్మ పరిరక్షణకు, వ్యాప్తికీ టీటీడీ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. హిందూ ధార్మిక పరిషత్, వేద విశ్వ విద్యాలయం, వేద పాఠశాలల ద్వారా శాశ్వత కార్యక్రమాలు నడుస్తున్నాయి. వాటి కార్యక్రమాలను విస్తరించే ఆలోచనతో చర్యలు చేపడుతున్నాం."

తిరుమల విజన్

తిరుమల యాత్ర అన్ని విధాలా సంతృప్తి కలిగించి దివ్యానుభూతిని మిగిల్చేలా వుండాలన్నది టీటీడీ అంతిమ లక్ష్యం. తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలికంగా భక్తులకు నాణ్యమైన సేవలందేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించే పనిలో వున్నాం.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకీకరణ

తిరుమలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. మ్యాపింగ్ లేదు. అవసరమైన పరికరాల్లేవు. అందుకని గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ నుంచీ నిపుణులను రప్పించి అధ్యయనం చేయించాం. వారి సలహా మేరకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తాం. దానికోసం ఓ డివిజన్ ఏర్పాటు చేస్తాం.

వేటగాళ్ల కరెంటు ఉచ్చు

- తీగలకు తగిలి గజరాజు మృతి
- దేపట్లవారిపల్లె సమీపంలో ఘటన



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, సీసీఎఫ్



మృతి చెందిన మగ ఏనుగు

భాకరాపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం వేటగాళ్లు లాగిన కరెంటు తీగలకు తగిలి గజరాజు మృతి చెందింది. ఈ ఘటన చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ దేపట్లవారిపల్లె సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. డీఎఫ్‌వో వివేక్ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన శివారెడ్డి మామిడి తోటలో అడవి పందుల కోసం వేటగాళ్లు.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి తీగలు లాగారు. కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో తిరుగుతున్న 18 ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఆరికలవారిపల్లె గ్రామాల పొలాల గూండా దేపట్లవారిపల్లె సమీపానికి వచ్చాయి. అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి టమోటా తోటను, పక్కనే ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. దాని పక్కనే ఉన్న శివారెడ్డి మామిడి తోటలోకి వెళ్లగా.. అక్కడ అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు ఏనుగు కాళ్లకు తగలడంతో ఆ విద్యుత్ తీగను తొండంతో లాగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో వేటగాళ్లు ఏనుగు వద్ద విద్యుత్ తీగలను కత్తిరించుకుని వెళ్లిపోయారు. ఏనుగు తొండం వద్ద విద్యుత్ తీగ అలాగే ఉండిపోయింది. విద్యుత్ తీగ తగలడంతో ఏనుగు కాలు, తొండానికి గాయమైనట్లు డీఎఫ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఎఫ్ సెల్వం, ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ రియాజ్ అహ్మద్ పరిశీలించారు. అనంతరం జూపార్కు వైద్యులు తోయిబా సింగ్ నేతృత్వంలో వైద్య బృందం, భాకరాపేట పశువైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు ఊర్లలో కరెంటు తీసేశారు

ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి: భాకరాపేట మండలం దేపట్లవారిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందిన నేపథ్యంలో శనివారం రాత్రి రెండు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేశారు. శనివారం రాత్రి 10 గంటలకు శాంతినగర్ చెరువులో 10 ఏనుగులు తిష్ట వేశాయి. తమ మందలోని ఏనుగు మృతి చెందితే ఆ సమీపంలోకి గుంపుగా చేరి ఘీంకరించి సంఘీభావం తెలుపుతాయి. ఆ పరిస్థితుల్లో మనుషులు కనిపిస్తే దాడి చేసే అవకాశం ఉంటుంది. అందుకని ఫారెస్టు అధికారులు, పోలీసులు సోషల్ మీడియాలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు వేస్తారేమోననే ఉద్దేశ్యంతో అధికారులు ఈ రెండు గ్రామాల పరిధిలో సరఫరాను నిలిపివేయించారు. దీంతో గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి.

తిరుపతి వైసీపీలో

టీడీఆర్ టెర్రర్



విజిలెన్సు అధికారులు తనిఖీ చేస్తున్న కొంకా చెన్నాయిగుంట రోడ్డు

- తుడా అధికారులతో కలసి విజిలెన్సు క్షేత్రస్థాయి తనిఖీలు
- నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లలో ముగిసిన పరిశీలన
- వెలుగుచూడనున్న కోట్లాది రూపాయల అవినీతి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిమ్మిని బమ్మిని చేసి టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారుల గుట్టు బయటకు రానుంది. ఈంతో తిరుపతి వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. తిరుపతి నగర పాలక సంస్థలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణం డొంక వేగంగా కదులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని చేతిలోకి తీసుకుని తిరుపతిలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్లలో జరిగిన రూ.కోట్లాది అవినీతిపై నిగ్గు తేల్చడానికి జిల్లా విజిలెన్సు విభాగం రంగంలోకి దిగింది. తుడా అధికారులతో కలసి క్షేత్రస్థాయి విచారణ మొదలుపెట్టింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 400కు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రూ.4వేల కోట్ల కుంభకోణం జరిగిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై విజిలెన్సు డీజీపీ విచారణకు ఆదేశించారు. గత 10 రోజులుగా జిల్లా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, తుడా ఇంజనీరింగ్, సర్వే అధికారులు, విజిలెన్సు సిబ్బంది క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి విచారణ సాగిస్తున్నారు. ఇప్పటికి నాలుగు రోడ్లలో తనిఖీలు ముగియగా.. విజిలెన్సు అధికారుల బృందానికి ఒళ్లు గగుర్పాటయేలాఅ అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్టు వెలుగులోకి వస్తోంది. ఒక్కో రోడ్డులో కనీసం రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు సగటున అవినీతి చోటు చేసుకుని ప్రజా ధనం విచ్చలవిడిగా మట్టిపాలు చేశారని విచారణలో తేలింది. పెద్దఎత్తున కోట్లాది రూపాయలు అవినీతి జరిగి ఉంటుందని విజిలెన్సు అధికారులు అంచనా వేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై పూర్తి స్థాయిలో నిగ్గు తేల్చి త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందచేస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు.

తనిఖీలు పూర్తి చేసిన రోడ్లు ఇవీ

- అక్కారంపల్లి 40 అడుగుల రోడ్డు అరకిలోమీటరు వరకు కొత్తగా ఏర్పాటు చేశారు. దీనికోసం 25 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- అలాగే 1.2 కిలోమీటర్ల పొడవుతో రోడ్డు డెవలప్మెంటు కింద రేణిగుంట రోడ్డు అయిల్ మిల్లు నుంచి స్టేడియం వరకు ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం 62 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- కొంకా చెన్నాయగుంట 100 అడుగుల రోడ్డు 1.29 కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ రోడ్డులో 13 టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు.
- 150 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన మానస సరోవర్ 40 అడుగుల రోడ్డులో రెండు బాండ్లు పంపిణీ చేశారు. ఇందులో మొత్తం 102 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.

అవినీతి జరిగిందిలా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో చేపట్టిన చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రణాళికా బద్ధంగా, రోడ్డు డెవలప్మెంటు ప్లాన్ ఆమోదం మేరకు జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో విధంగా, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూడ బలుక్కుని రూ.కోట్లలో దోచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఇప్పటి వరకు విచారణ చేసిన నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లు అడ్డగోలుగా ఏర్పాటు చేసుకున్నట్లు తేలిందని విచారణ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న మార్కెట్ ధర కంటే ఎక్కువగా భూమి విలువ పెంచి, తదనుకుణంగా టీడీఆర్ బాండ్లు జారీచేసినట్టు తెలుస్తోంది. అలాగే ఖాళీ స్థలానికి కూడా మార్కెట్ ధర కంటే ఎక్కువగా వాణిజ్య భూములను చూపించి మార్కెట్ విలువ కంటే పది రెట్లు ఎక్కువ ధరకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. టీడీఆర్ బాండ్లలో సూచించిన కొలతలకు క్షేత్ర స్థాయిలో ఉన్న కొలతల మధ్య రోడ్డు వెడల్పు, పొడవులో చాలా తేడాలున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. ప్రతి రోడ్డు వెడల్పు, పొడవు కొలిచి ప్రతిపాదనల్లో సూచించిన కొలతలు, రోడ్లు వేసిన కొలతలు పరిశీలించి నివేదికను విజిలెన్సు ఎస్పీకి సమర్పిస్తున్నారు. ఇందులో ఇద్దరు మాజీ ప్రజా ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల రోజుల వ్యవధిలో మొత్తం రోడ్లు తనిఖీ చేసి అవినీతి అక్రమాలపై సమగ్ర నివేదిక అందచేయనున్నారు.

ఆ విద్యార్థులకు వైద్య పరీక్షలు

డ్రగ్స్ ఆరోపణలపై అధికారుల స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీలో డ్రగ్స్ కలకలంపై ఉన్నతాధికారులు స్పందించారు. యాంటీ డ్రగ్స్ కమిటీతో వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమశ్రీ శనివారం సమావేశమయ్యారు. డ్రగ్స్ తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు రుయాలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రుయా నివేదిక, యాంటీ డ్రగ్స్ కమిటీ సిఫారసులను అనుసరించి తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఆ మేరకు అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు.


ఎందుకీ మౌనం..?

వైసీపీ వీరవిధేయుల్లో ఆవేదన

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ నాయకుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పగ్గాలు వచ్చాయన్న ఆనందోత్సాహాలు కొద్ది రోజులకే వైసీపీ శ్రేణుల్లో ఆవిరైపోతున్నాయి. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల వైపు చూడడంతో ముఖ్యనాయకులు నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు విజయవాడకు వెళ్లడం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చించడం వంటి పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి కుడిభుజంగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో పాటు అతడి వర్గీయులు, భూమన ఫొటోను బంగారు ఉంగరాలు, లాకెట్లో వేసుకుతిరిగిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపించడంతో వైసీపీ వర్గాల్లో నిస్తేజం ఆవహించింది. ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భూమన ఆయా నియోజకవర్గాల సమావేశాల్లో బిజీగా ఉంటున్నారు. ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ కొన్నిరోజులుగా తిరుపతిలో కనిపించడంలేదు. అవిశ్వాసంపై ఏమి జరిగినా స్వాగతిస్తామన్నట్టుగా మేయర్ శిరీష ఉండడంతో వైసీపీ సీనియర్ కార్పొరేటర్లు ఆవేదనతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుపతి రాజకీయం రివర్స్ అయిపోయింది. కాపాడుకోవాల్సిన వాళ్లు సైలెంట్ అయిపోయారు. కాపాడాల్సిన వారు కూడా మౌనం దాల్చారు' అంటూ భూమన ముఖ్య అనుచరుడు, కార్పొరేటర్ ఎస్కే బాబు తన ఆవేదనను శుక్రవారం సాయంత్రం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇది గమనించిన భూమన సాహితీ మిత్రుడొకరు.. 'ఏంది బాబూ ఇది?' అంటూ ఇంటిపోరును వీధిలో వేసుకుంటామా? అన్నట్టుగా అసంతృప్తితో కామెంట్ చేశారు. దీంతో కొద్దిసేపటికి ఫేస్‌బుక్ నుంచి తన పోస్ట్‌ను ఎస్కే బాబు తొలగించారు. అప్పటికే రాజకీయ వర్గాల్లో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చేజారిపోతున్న కార్పొరేటర్లను బుజ్జగించి కాపాడుకోవాల్సిన మేయర్ చేతులెత్తేయడం, తమకే బలముందని కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేయాల్సిన భూమన పట్టించుకోకపోవడం వైసీపీలో చర్చగా మారుతోంది.



నేలపట్టు పక్షుల పురిటిల్లు





ప్రత్యేక కథనం దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

పెళ్లయ్యాక మెట్టినింటికి వెళ్లిపోయిన ఆడపిల్లలు, పురిటి కోసం మాత్రం పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. పక్షులు కూడా ఈ ఆనవాయితీని పాటిస్తాయని నేలపట్టు నిరూపిస్తోంది. సైబీరియా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బర్మా, ఇంగ్లండ్, హిమాలయాలు.. దూరాలతో పనిలేదు. జీపీఎస్‌తో పనిలేదు. రెక్కల కష్టమనే వెరపు ఉండదు. ఎగురుకుంటూ ఎగురుకుంటూ నవంబరు నెలకల్లా నేలపట్టుకి చేరుకుంటాయి. పుల్లాపుచికా, గడ్డీగాదం ఏరుకొచ్చి గూళ్లు కట్టుకుంటాయి. గుడ్లు పెట్టి పొదుగుతాయి. పులికాట్ సరస్సులోనూ, పరిసరాల్లోని చెరువులూ, నీటి చెలమలూ, వరికయ్యల్లోనూ నత్తలూ, ఎండ్రకాయలూ, కప్పలూ, చేపలూ, రొయ్యలూ వేటాడి తెచ్చి పిల్లలకు గోరు ముద్దలు చేసి తినిపిస్తాయి. రెక్కలు అమిరి ఎగరగలవని నమ్మకం కుదిరాక తిరుగు ప్రయాణం మొదలు పెడతాయి. ఫిబ్రవరి నుంచి మే నెలదాకా వెనక్కి వలస సాగుతుంది. మళ్లీ వేల కిలోమీటర్లు ఎగిరి వెళ్లిపోతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు ఎక్కడెక్కడో పెరిగి పెద్దయినా, పుట్టింటిని గుర్తు పెట్టుకుని మళ్లీ ఏడాదికంతా నేలపట్టును వెతుక్కుంటూ వస్తాయి. ఏటా దాదాపు 8నుంచి 9 వేల పక్షులు నేలపట్టు విడిదికి చేరుకుంటాయి. గత ఏడాది 8286 పక్షులు రాగా, ఈ ఏడాది ఇప్పటికే 7813 పక్షులు నేలపట్టులో రెక్కలు రెపరెపలాడిస్తున్నాయి. తెల్లని పక్షులు వాలిన పచ్చని చెట్లతో కూడిన నేలపట్టు అందాలను ఆస్వాదించడానికి పర్యాటకులు ఈ సీజన్‌లో పెద్ద సంఖ్యలోనే వస్తున్నారు.

నేలపట్టు రారాజు



పెలికాన్

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో భారీకాయంగల పక్షి పెలికాన్. దాదాపు 15 కిలోల దాకా బరువుంటుంది. దీనిని గూడ బాతు, గూడకొంగ అని స్థానికంగా అంటారు. నేలపట్టులో గ్రే పెలికాన్స్ (ముదుర బూడిద రంగు) పక్షులు ఎక్కువగా విడిది చేస్తాయి. 4 అడుగుల పొడవుతో ఉండే పెలికాన్ రెక్కలు 6 నుండి 7 అడుగుల నిడివి కలిగి ఉంటాయి. మెడ కింద భాగంలో 4 అడుగుల సంచి లాంటిది ఉంటుంది. ఉదయాన్నే లేచి పులికాట్ సరస్సులో వేటకు వెళ్తుంది. 5 కిలోల దాకా బరువుండే చేపలు, పీతలు, కప్పలు వేటాడి మెడకింది సంచిలో వేసుకుని సాయంత్రానికి గూటికి చేరుతుంది. నేలపట్టు చెరువులోని కడప చెట్లమీద గూడు కట్టుకుని రెండు,మూడు గుడ్లు పెడుతుంది. ఆడపక్షి గూటిలో ఉంటే మగపక్షి వేటకు వెళ్తుంది. 30 రోజులపాటు పొదుగుతుంది. పిగిలిన పిల్లల్ని 12 నెలల పాటు పెంచి, రెక్కలొచ్చాక వాటితో కలిసి మరో ప్రాంతానికి వలసపోతుంది. అక్టోబరు చివరలో పెలికాన్‌ల రాకడ మొదలవుతుంది. శ్రీలంక, బర్మా, ఆస్ట్రేలియాల నుంచీ, హిమాలయ ప్రాంతాల నుంచీ పెలికాన్‌లు ప్రతి ఏటా నేలపట్టుకు వలస వస్తాయి. పెలికాన్ జీవిత కాలం పదేళ్లు.

ఇప్పటికే చేరుకున్న పెలికాన్‌ల సంఖ్య: 1316
గత ఏడాది వచ్చినవి: 1014

తొలి అతిథి



నత్తగుల్ల కొంగ

విదేశీ విహంగాల్లో మొదటిగా వచ్చే పక్షి ఓపన్ బిల్ స్టార్క్స్. దీనిని నత్తగుల్లకొంగ అంటారు గోధుమ రంగులో నిగ నిగలాడుతూ ఉండే ఈ పక్షి, సంతానోత్పత్తి తరువాత తెలుపు రంగులోకి మారడం విశేషం. రెండు నుండి మూడు గుడ్లు పెట్టి పొదుగు తుంది. నేలపట్టులోనే సంతానోత్పత్తి చేస్తుంది. ఇవి రైతు నేస్తాలు కూడా. వరి పొలాల్లో సంచరించి చీడపీడలను తినేస్తాయి. దాంతో తెగుళ్ళ బెడద తగ్గుతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 1964
గత ఏడాది వచ్చినవి : 3116

గుంపులుగా పొదిగే పక్షి



తెల్లకంకణాయి

దక్షిణ అమెరికా, వెస్టిండీస్ దేశాల నుంచి అక్టోబరు నెలాఖరు రోజుల్లో నేలపట్టుకు చేరుకున్న పక్షి తెల్లకంకణాయి (వైట్ ఐబీస్). ఏప్రిల్ మొదటి వారం వరకు ఇక్కడే ఉంటాయి. చెరువులోని చెట్ల మీద గుంపులుగా పొదుగుతాయి. ఒక పక్షి రెండు నుంచి ఐదు గుడ్లు పెడుతుంది. చేపలు, కప్పలు, కీటకాలను ఆహారంగా స్వీకరిస్తుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 2458
గత ఏడాది వచ్చినవి : 1274

ఇంగ్లండ్ మిత్రులు



చిన్నస్వాతికొంగలు

ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో ఎక్కువగా నివశించే చిన్నస్వాతికొంగలు (లిటిల్ ఎగ్రేట్స్) నేలపట్టులో అరుదుగా మాత్రమే తారసపడుతుంటాయి. 1994 నుండి మాత్రమే ఇవి నేలపట్టుకు వస్తున్నాయి. లోతు లేని నీళ్ళల్లో ఆహారం సేకరణ చేస్తుంది. చిన్న జీవులను తింటుంది. 3 - 5 వాటి గుడ్లు నీలం, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. 3 నుంచి 5 గుడ్లను ఒక పక్షి పెడుతుంది. మూడు వారాలు పాటు పొదిగి, ఆరు వారాల పాటు పిల్లను పెంచి వాటితో కలిసి ఎగిరి వెళ్ళి పోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 1686, గత ఏడాది వచ్చినవి: 1562

వెదురుపట్టు స్నేహితులు





ఎర్రకాళ్ల కొంగలు

నేలపట్టుకు సమీపంలోని వెదురుపట్టు నర్సమాంబపుర అగ్రహారంలో ఈ అరుదైన ఎర్రకాళ్ళ కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్) విడిది చేస్తాయి. హిమాలయాల్లోనూ, దక్షిణాసియాలోనూ కనిపించే ఈ పక్షులు డిసెంబరులో ఇక్కడికి చేరుకుంటాయి. ఇళ్ల మధ్య ఉండే చింతచెట్ల మీదే వీటి ఆవాసం. పగలంతా పులికాట్ సరస్సులోని శ్రీహరికోట, కొండూరు పాళెం, రాయదొరవు, ఇరకం, పేర్నాడు ప్రాంతాల్లో వేట సాగించి, సాయంత్రానికి వెదురుపట్టుకు చేరుకుంటాయి. చేపలను, పీతలు, రొయ్యలు ఆహారంగా తీసుకుంటాయి. వీటి విసర్జితంతో చెట్లకింద దిబ్బలు పేరుకుంటాయి. ఇది పొలాలకు ఎరువుగా వాడుకుంటారు. స్థానిక ప్రజలతో ఎంతో స్నేహంగా సన్నిహితంగా మెలుగుతాయి. వెదురుపట్టు ప్రజలు వీటి రక్షకులుగా ఉంటారు. ఫిబ్రవరి నుంచి గుడ్లు పొదిగి సంతానోత్పత్తి చేస్తాయి. మే నెలదాకా పిల్లల్ని పెంచి, వెంటతీసుకుని వెళ్లిపోతాయి.

శ్రీలంక నుంచి వచ్చే

నేలపట్టులో చాలా పెద్ద శ్రీలంక నుండి వచ్చే పక్షి లిటిల్ కార్మోరెంట్స్. శరీరం నల్లగా, ఈకలు గోధుమ రంగులో ఉంటాయి. ఒంటరిగా నీటిలో మునుగుతూ ఆహార అన్వేషణ చేస్తుంది. ఒక మీటర్ లోతున్న నీటిలో మాత్రమే ఆహార అన్వేషణ చేస్తుంది. నవంబరు నుండి ఫిబ్రవరి వరకు ఈ జాతి పక్షులు ఇక్కడ సంచరిస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 41
గత ఏడాది వచ్చినవి : 301



చిన్న నీటి కాకులు

రాత్రి వేటగాడు



శబరి కొంగ

గ్రీకు జాతికి చెందిన నైట్ హెరాన్స్ ను నేలపట్టులో శబరికొంగ అని పిలుస్తారు. పొట్టి మెడ, పొట్టి కాళ్ళు బూడిద రంగు శరీరం పైన నలుపు కిరీటం గల పక్షి ఇది. రాత్రి వేళ్ళలో వేట సాగిస్తుంది. చిన్న చేపలు, కప్పలు, జలకీటకాలను తింటుంది. పగటి పూట చెట్లు, పొదల్లో విశ్రాంతి తీసుకొంటుంది. 3 నుండి 8 గుడ్లు పెడుతుంది. ఆగ్నేయ ఐరోపా నుంచి ఎగిరి వచ్చి, గుడ్లు పెట్టి, .పొదిగి పిల్లలతో వెళ్లిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 68
గత ఏడాది వచ్చినవి : 593

అరుదైన గెస్ట్



తెడ్డుముక్కు కొంగ

నేలపట్టుకు అరుదైన వలస పక్షి ఇది. నలుపు, పసుపు రంగుల కలిగిన గరిటిలాంటి(స్పూన్ ఆకారంలో) ముక్కు ఉంటుంది. సంతానోత్పత్తి కోసమే నేలపట్టుకు వస్తుంది. రెండు గుడ్లు పెడుతుంది. మంచి నీరు, పులికాట్‌తో పాటు, చెక్ డ్యామ్‌లు, చిత్తడి పొలాల్లో వేట సాగిస్తుంది. చేపలు, రొయ్యలు ఎక్కువగా స్వీకరిస్తుంది. తక్కువ లోతుండే పులికాట్‌లో వీటికి అనువైన ఆహారం లభిస్తుండంతోనే ఇక్కడికి ఏటా పెద్ద సంఖ్యలో వస్తున్నాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 82 , గత ఏడాది వచ్చినవి : 26

నేలపట్టు విడిదికి చేరుకున్న మరికొన్ని పక్షులు...

లార్జ్ ఎగ్రేట్స్(పెద్దస్వాతి కొంగలు) 10, పాండ్ హెరాన్స్(గుడ్డి కొంగలు) 35, .క్యాటిల్ ఎగ్రేట్స్ (పశువుల కొంగలు) 68, ఇండియన్ మోర్ హెరాన్స్(జమ్ముకోళ్ళు) 14, స్పాట్ బిల్ డక్స్ (చుక్కమూతి బాతులు) 10, డాబ్ చిక్స్ (బుడగ బాతులు) 13, కూట్స్(చుక్కకోళ్ళు)12, ఫర్పల్ మోరోహెన్స్(చెంచుకోడి)6, విజిలింగ్ డక్స్(ఈల వేసే చిలువలు) 30 ఉన్నాయి.



తొలిరోజు 1043 క్లెయిమ్‌లు

- ఓటు నమోదు, సవరణకు దరఖాస్తుల స్వీకరణ
- నేడూ అవకాశం



పాకాలలో ఓటరు నుంచి నుంచి క్లెయిమ్‌లు స్వీకరిస్తున్న బీఎల్వోలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రెండో రోజులపాటు బూత్ స్థాయిలో జరిగే ఓటర్ల జాబితా సవరణ శనివారం మొదలైంది. తొలిరోజు ఓటర్ల నమోదు.. సవరణకు 1043 క్లెయిమ్‌లు అందాయి. ఏడు నియోజకవర్గాల పరిధిలోని 2141 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఓటు హక్కు నమోదుకు 469 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇక విదేశాల్లోని వారు 21 మంది ఓటుహక్కు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. అలాగే, ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు 265, ఓటు బదిలీకి, సవరణలకు 288.. ఇలా.. మొత్త 1043 క్లెయిమ్స్ అందాయి. ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు, తొలగింపులు, ఓటర్ల సవరణ, బదిలీ కార్యక్రమం జరగనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 18 ఏళ్ల నిండి ఇంకా ఓటు హక్కు పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా వెలువడనుంది.

రెండు నెలలు తీసుకోకపోయినా
పింఛను ఆగదు

- కొత్త విధానంతో లబ్ధిదారులకు ప్రయోజనం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలు వరసగా పింఛను తీసుకోకపోయినా ఆగదు. మూడో నెలలో మొత్తం కలిపి తీసుకోవచ్చు. ఈ మేరకు రెండు రోజుల కిందట ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది. వైసీపీ హయాంలో ప్రతినెలా పింఛను తీసుకోవాల్సిందే. ఒకే నెల అందుబాటులో లేకపోతే తరువాత నెలలో ఆ పింఛను వచ్చేది కాదు. ఈ నిబంధనతో పింఛనుదారులు నష్టపోయారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే 2014- 19లో అనుసరించిన విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ప్రకారం.. ఒక నెలలో తీసుకోకుంటే రెండో నెలలో రెండూ కలిపి.. ఒక వేళ రెండో నెలలోనూ తీసుకోలేకుంటే మూడో నెలలో మూడు పింఛన్లు కలిపి తీసుకోవచ్చు. దీనివల్ల తిరుపతి జిల్లాలో 2,65,488 మంది పింఛను లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. లబ్ధిదారుల్లో కొంతమంది అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉంటున్నారు. కొందరు కుమారుడు, కుమార్తె ఇళ్ల వద్ద ఉంటున్నారు. ఇంకొందరు ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. వీరంతా చెన్నై, బెంగళూరు, పక్క జిల్లాల నుంచి రావాల్సి వస్తోంది. ఇలా దూరప్రాంతాల్లో ఉండేవారు మూడో నెలల్లో ఏదో ఒకనెల వచ్చి పింఛను తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ నిర్ణయం పేదలకు పెద్ద భరోసా లాంటిదని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గత నెలలో 1,499 మంది పింఛను తీసుకోలేదని గుర్తుచేశారు. కొత్త పింఛను విధానం వల్ల దూరప్రాంతాల్లోని వారికి దారి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.

వచ్చే నెల నుంచి స్పౌజ్ పెన్షన్

డిసెంబరు నుంచి స్పౌజ్ పెన్షన్‌ను అమలు చేస్తూ ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. ఈ మేరకు పెన్షనుదారుల్లో భార్య లేదా భర్త చనిపోతే.. ఆటోమేటిగ్గా ఆ దంపతుల్లో మరొకరు లబ్ధిదారు అవుతారు. దీనికోసం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు డెత్ సర్టిఫికెట్ అందజేయాలి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,731 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,890 మంది తలనీలాలు సమర్పించారు.

మా కుటుంబం రాజకీయాల్లోకి రావడంపై
కాలమే నిర్ణయిస్తుంది

- మాజీ మంత్రి అరుణకుమారి



చంద్రగిరిలో సినిమా తిలకిస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి తదితరులు

చంద్రగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'నేను రాజకీయాల నుంచి రిటైరయ్యాను. మా కుటుంబం రాజకీయాల్లోకి రావడమనేది కాలమే నిర్ణయిస్తుంది' అని మాజీ మంత్రి అరుణకుమారి వ్యాఖ్యానించారు. గల్లా కుటుంబం మళ్లీ రాజకీయాల్లోకి రావడంపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. తన మనవడు గల్లా అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' సినిమాను శనివారం ఆమె చంద్రగిరిలోని ఎస్వీ సినిమా థియేటర్‌లో తిలకించారు. 'ఈ సినిమాలో సనాతన ధర్మం, స్వేచ్ఛ, మాతృత్వం ఎలా ఉంటుందో చూపించారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు చూడదగ్గ సినిమా. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. అన్ని వర్గాల ప్రజలు సినిమాను ఆదరించి, గల్లా అశోక్‌ను ఆశీర్వదించాలి' అని ఆమె కోరారు. చిన్న వయసులోనే అశోక్ సూపర్ స్టార్ కృష్ణ మేనమామ మహేష్‌బాబుతో నటించారని ఆమె గుర్తు చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, నాయకులు బడి సుధాయాదవ్, ముడిపల్లి సురేష్‌రెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, ఎల్లప్పరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ వాసు, జయచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు మస్తాన్, చేగు ప్రశాంత్ గుప్తా, మాధవరెడ్డి, గల్లా అభిమానులు రాజగోపాల్, ప్రదీప్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకాళహస్తి హస్తకళలు





దశరథాచారి స్టాల్ - సుధీర్ కలంకారీ చిత్రాలు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తివాసులు ఏర్పాటు చేసిన దారువు బొమ్మలు, కలంకారీ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్ మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి కొయ్యబొమ్మలను ప్రదర్శించారు. కలంకారీ కళాకారుడు సుధీర్ కలంకారీ చిత్రాలను ప్రదర్శించారు. వివిధ వస్త్రాలపై దేవతామూర్తులు, పురాణ ఇతిహాస రూపాలను పురాణగాథలను ప్రతిబింబించేలా తయారు చేశారు. కూరగాయలు, మొక్కల నుంచి తయారు చేసిన ప్రకృతి సిద్ధమైన రంగులను వినియోగించారు.

ఆయుర్వేద మందుల దుకాణాలపై దాడులు

- అనుమతిలేని మందుల స్వాధీనం
- లైసెన్సు లేని ధన్వంతరీ చికిత్సాలయం సీజ్



అనుమతి లేకుండా విక్రయిస్తున్న మందులను సీజ్ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఆయుర్వేద మందుల దుకాణాలపై విజిలెన్సు, డ్రగ్ కంట్రోల్, ఆయుష్ అధికారులు శనివారం దాడులు చేశారు. అనుమతిలేని మందులు విక్రయిస్తున్నారని, ఆయుర్వేద మందుల స్థానంలో ఇంగ్లిష మందులు విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారని కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేశారు. విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, చంద్రశేఖర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, ఆయుష్ డాక్టర్ విజయకుమార్ రెండు బృందాలుగా విడిపోయి స్విమ్స్ సర్కిల్, కోదండరామాలయం రోడ్డు, ఇతర ప్రాంతాల్లోని ఆయుర్వేద మందుల దుకాణాలను తనిఖీ చేశారు. కోదండరామాలయం రోడ్డులోని ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయానికి లైసెన్స్ లేకపోవడంతో సీజ్ చేశారు. కోదండరామాలయం దక్షిణ మాడ వీధిలోని అమృత ఆయుర్వేద మెడికల్స్‌లో అనుమతి లేని మందులు విక్రయిస్తున్నారంటూ మొత్తం స్టాక్‌ను స్వాధీనం చేసుకుని, నోటీసు అందజేశారు. అనుమతిలేని మందులు విక్రయించినా, దుకాణాలు నిర్వహించినా చర్యలు తప్పవని విజిలెన్సు సీఐ వెంకటరవి హెచ్చరించారు.

నేడే రూరల్ ప్రీమియర్ లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూరల్ ప్రీమియర్ లీగ్ 2024 పోటీలు ఆదివారం ఎస్వీయూ మైదానంలో నిర్వహించనున్నారు. వాలీబాల్ పోటీలకు 300మంది పురుషులు, త్రోబాల్ పోటీలకు 100మంది మహిళలు తిరుపతి చేరుకున్నారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు వచ్చేనెల మొదటి వారంలో విజయవాడలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారు. అక్కడ విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులో జరిగే అంతిమపోరులో ప్రాతినిధ్యం వహిస్తారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలో 2, 4వ సెమిస్టర్‌కు సంబంధించిన పలు కోర్సుల ఫలితాలు విడుదలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

నాకు రాదు... నేను మాట్లాడను..

పది నిమిషాలే ఉంటా... మీరు ఏమైనా చేసుకోండి

మండల మీట్‌లో వైద్యాధికారి నిర్లక్ష్య సమాధానం



డాక్టర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి

దొరవారిసత్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేను మాట్లాడను... నాకు రాదు... నేను పది నిమిషాలే ఉంటా... మీరు ఏమైనా చేసుకోండి... అంటూ వైద్యాధికారి వింత, నిర్లక్ష్యపు సమాధానాలతో అధికారులు... ప్రజాప్రతినిధులు నోరెళ్లబెట్టారు. దొరవారిసత్రం మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఎం.చంద్రకళ సమావేశం మధ్యలో వచ్చారు. అప్పటికే శాఖలవారీగా సమీక్ష జరుగుతుండడంతో ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ వైద్యాధికారిని పిలిచారు. సభావేదిక వద్దకు వెళ్లిన డాక్టర్ నేను మాట్లాడను... నాకు రాదు... అని జవాబు ఇచ్చారు. వేదికపైనే ఉన్న ఎంపీపీ భర్త, వైఎస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి మైక్ అందుకుని మీ శాఖ అందించే సేవల గురించే కదా చెప్పమంటోంది, మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇంతలో ఆమె వేదిక దిగి వెళ్లిపోయారు. నేను పది నిమిషాలే ఉంటాను అంటూ.. కాసేపు కూర్చొని సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. ఆమె తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో గోవర్ధన్‌ను ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ కోరారు. ఇక అక్కరపాక సర్పంచు ప్రభాకరెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో సేవలు అందించడంలేదని పలువురు సర్పంచులు మండిపడ్డారు. మీజూరు, తొగరాముడి గ్రామాల్లో రైతులకు ఎరువులు అందించడం లేదని తొగరాముడి సర్పంచు ప్రసాద నాయుడు వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నించారు. వేణుంబాక పాఠశాలకు ప్రభుత్వం అందించిన బెల్టులు, షూ, బ్యాగ్‌లు విద్యార్థులకు ఇవ్వలేదని వేణుంబాక ఎంపీటీసీ మస్తాన్ అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో గోవర్ధన్, తహసీల్దారు శైలాకుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల మీట్



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచనలిస్తున్న జడ్పీటీసీ రౌతు రామకృష్ణ

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. వాకాడులోని స్త్రీశక్తి భవనంలో శనివారం కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ రౌతు రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీడీఎస్ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి కోరారు. స్వర్ణముఖి బ్యారేజీ గేట్ల మరమ్మతులు చేపట్టి ఆధునీకరించాలని కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావుకు సూచించారు. కాగా, సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, డిప్యూటీ తహసీల్దారు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 7వ తేదీన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజామురగదాస్ తెలిపారు. శనివారం కళాశాలలో క్రికెట్ పోటీలకు సంబంధించి జర్సీలను, విజేత కప్పును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో 2004 బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులు క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను జూనియర్లతో పంచుకుని వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేందుకు, తమ వంతు సహకారం అందించేందుకు ఈ తరహా పోటీలు స్నేహపూర్వకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధనుంజయ, మోహన్, రాజయ్య, రవిచంద్ర, భాస్కర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

వెంకటగిరి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 26న కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత పేర్కొన్నారు. శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రమణయ్య, సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి, చిన ఓబయ్య, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు

వెంకటగిరి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు/కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన గోపాలయ్య వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. కోట మండలంలోని సిద్ధవరం గ్రామానికి చెందిన గోపాలయ్య వద్ద నుంచి 12మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వాకాడు సీఐ ప్రసాద్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట, వెంకన్నపాళెం, తిన్నెలపూడి, గూడలి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, చెందోడు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు జయజయరావు, ఆర్ఐ మధులత శనివారం పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సూళ్లూరుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ ఆర్.శేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

26 నుంచి ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయంపు, కోటంబేడు, పెరిమిడి, ఊట్లపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో వినీల్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నెర్రికాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకుకు ఎత్తిపోతలు

సూళ్లూరుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు అందుబాటులో లేదు. ఫలితంగా ఏటా నీటి ఎద్దడి తప్పడం లేదు. సూళ్లూరుపేట పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు 2006లో పిండిపాలెం వద్దనున్న కోటపోలూరు చెరువులో రూ.6 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (ఎస్ఎస్)ను నిర్మించారు. గత రెండేళ్లుగా ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి ఎస్ఎస్ ట్యాంకు కూడా నీరులేక ఎండుముఖం పట్టేస్థాయికి చేరింది. 750 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉన్న ఎస్ఎస్ ట్యాంకు ప్రస్తుతం 65 మిలియన్ లీటర్ల స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు నీటి ఎద్దడి నివారణపై దృష్టిసారించారు. నెర్రికాలువలో మోటార్లు పెట్టి ఎత్తిపోతల ద్వారా ఎస్ఎస్ ట్యాంకును నింపేందుకు అధికారులు నడుం బిగించారు. ఇటీవల జిల్లాలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కాళంగి నదితో పాటు దానికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువకూ భారీగా వర్షపునీరు చేరింది. మున్సిపాలిటీ అధికారులు నెర్రికాలువలో నాలుగు 7.5 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపుతున్నారు.



మోటార్ల ద్వారా ఎస్ఎస్ ట్యాంకును నింపుతున్న దృశ్యం

యువకుడి హత్య కేసులో ఐదుగురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఖాదర్‌బాషా

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని దుగరాజపట్నం వద్ద వారం రోజుల క్రితం జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ ఖాదర్‌బాషా శనివారం మీడియాకు వెల్లడించారు. గూడూరు పట్టణంలోని శివాలయం వీధికి చెందిన కొండా అనిత్‌కుమార్‌రెడ్డి(25), అరుందతిపాళేనికి చెందిన కనుపూరు శ్రీహరి(జెమినీ) స్నేహితులు. శ్రీహరి భార్యతో అనిత్‌కుమార్‌రెడ్డి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీహరి తన స్నేహితులైన బాకం నరేష్, పేర్నాటి చెందు, షేక్ కాలేషా, షేక్ జావిద్‌తో కలిసి అనిత్‌కుమార్‌రెడ్డిని హత్య చేసేందుకు ప్లాన్ వేశారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం మద్యం తాగుదామని అనిత్‌కుమార్‌రెడ్డి, శ్రీహరి ద్విచక్ర వాహనంలో చిల్లకూరు మండలం చుట్టుగుంట హైవే రోడ్డు పక్కన ఉన్న ఓ దాబా వెళ్లారు. అప్పటికే శ్రీహరి స్నేహితులు దాబా వద్ద వేచి చూస్తున్నారు. అందరూ కలిసి మద్యం తాగారు. అందరూ కలిసి ఒక్కసారిగా అనిత్‌కుమార్‌రెడ్డిపై కర్రలతో దాడిచేసి హత్యచేశారు. మృతి చెందిన అనిత్ కుమార్‌రెడ్డిని కారు డిక్కీలో వేసుకొని వాకాడు మండలంలోని దుగరాజపట్నం దక్షిణ పల్లం సమీప పొలాల్లో పడేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు పత్రికల్లో వార్త రావడంతో మృతుడు తండ్రి ఉదయకుమార్‌రెడ్డి తమ బంధువులతో వచ్చి శవాన్ని చూసి తన కొడుకు అనిత్‌కుమార్‌రెడ్డిగా నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వాకాడు సీఐ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చిల్లకూరు దాబా వద్ద ముగ్గురిని, నెల్లూరులో ఇద్దరిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన ఐదు కర్రలు, ఒక ట్రిమ్మర్, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు, కోట, చిట్టమూరు ఎస్ఐలు నాగబాబు, పవన్, చినబలరామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా చెంచుకుమార్



ఓజిలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కోడిపిల్ల చెంచు కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్ ఆయనను ఎంపిక చేసింది. ఆదివారం విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో స్టేట్ బెస్ట్ సోషల్ స్టడీస్ టీచర్ అవార్డు-2024ను చెంచు కుమార్ అందుకోనున్నారు. ఈ మేరకు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, సురేష్ నుంచి చెంచుకుమార్‌కు ఆహ్వానం అందింది.

మంచినీళ్లిచ్చి దాహార్తి తీర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, వేదికపై చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(జడ్పీ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు శిథిలావ్యవస్థ చేరాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఓసారి తాగునీరు ఇస్తున్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారి ఇచ్చేలా చూడండి. గిరిజన ప్రాంతాల్లో క్లోరినేషన్ లేక ఎర్రనీళ్లు తాగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించి, వాళ్ల ఆరోగ్యాలను కాపాడాలి'... అంటూ జడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలతో పాటు జడ్పీటీసీ సభ్యులు కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం శనివారం జరిగింది. గ్రామీణ నీటి సరఫరా, తాగునీటి ఇబ్బందులపై సభ్యులు చర్చించారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో వెంకటగిరి ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రైతులంతా పంటలు వేసుకుంటున్నారని, కానీ చెరువులకు నీళ్లు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు తెలియచేయడం లేదన్నారు. వెంటనే రైతులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. జడ్పీ సమావేశంలో సాగునీరు, వ్యవసాయం తదితర అంశాలు ఉన్నప్పటికీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు కారణం లేకుండా అధికారులు గైర్హాజరైతే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వమే వాడేసుకొని ఇబ్బంది పెట్టిందన్నారు.

పంచాయతీల బలోపేతమే టీడీపీ లక్ష్యం: విజయశ్రీ



పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను బలోపేతమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మేజర్ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యానికి మొదట ప్రాధాన్యం కల్పించడంలో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యంపై దృష్టి సారించాయన్నారు. నియోజకవర్గంలోని తడ మండలంలో కారూరు పంచాయతీ, సూళ్లూరుపేట మండలంలో కోటపోలూరు, దొరవారిసత్రం మండలం ఏకోల్లు, నాయుడుపేట మండలం పుదూరు పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, నాగేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, సుధీర్, సుబ్బారావు, సంచి కృష్ణయ్య, సూరి, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థి తల్లికి చెక్కు అందజేస్తున్న జలీల్ అహ్మద్, టీడీపీ నేతలు

కోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని కురుగొండ కరుణను గ్రీన్ ఫౌండేషన్ ఆదుకుంది. కరుణ ఇంటర్ పూర్తిచేసి నీట్‌కు శిక్షణ పొందుతోంది. ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేయాలని గ్రీన్ ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో ఆ సంస్థ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ విద్యార్థినికి రూ.20వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, నౌషాద్, బాబు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేశారంటూ ఆందోళన

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన జమీలా తన భూమిని కబ్జా చేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ కుటుంబసభ్యులతో కలిసి కోట తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. జమీలాకు చిట్టేడులో 71 సెంట్ల పట్టాభూమి, పక్కనే మరో 41 సెంట్ల అసైన్‌మెంట్ భూమి ఉంది. చిట్టేడు గ్రామానికి చెందిన ఫయాజ్ తమ భూమిని సాగు చేస్తూ కౌలు సక్రమంగా ఇవ్వడం లేదని, అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పింది. అతని నుంచి తన భూమిని ఇప్పించాలంటూ సీపీఐ నాయకులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని తహసీల్దారు చెప్పడంతో ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హుస్సేన్, షానవాజ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆదిశేషయ్యపై నెల్లూరుకు చెందిన వడ్డీ వ్యాపారులు రాజ, ఆయన అనుచరులు ముగ్గురు దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక లావాదేవీల విషయమై ఆదిశేషయ్యపై వడ్డీ వ్యాపారులు దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అపార్ సేవల కేంద్రం పరిశీలన

ఓజిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాయలంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అపార్(ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్టర్) సేవల కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి శనివారం పరిశీలించారు. ఆధార్ నమోదులో జరుగుతున్న పొరపాట్ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అపార్ నమోదు చేపట్టారు. మండలంలో ఓజిలితోపాటు కరబల్లవోలు సచివాలయంలో అపార్ సేవలు కొనసాగుతున్నాయి. ఓజిలిలో జరుగుతున్న అపార్ నమోదును పరిశీలించిన డీపీవో సుశీలాదేవి అక్కడి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా, ఓజిలి, కరబల్లవోలు సచివాలయాల్లో కొనసాగుతున్న అపార్ సేవలు ఆది, సోమవారం ఉండవని, తిరిగి మంగళవారం నుంచి 29వ తేదీ వరకు తిరిగి యధావిధిగా కొనసాగుతాయని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ఫొటో ఎగ్జిబిషన్

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు గోవిందు మాధవయ్య, శోభారాణి, రవీంద్రరెడ్డి తదితరులు ఎగ్జిబిషన్ పరిశీలించారు. అదే విధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ హెచ్ఆర్ స్మార్ట్‌విజన్ నెల్లూరు ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ సందీప్ అధ్యాపకులకు కంటి పరీక్షలు చేశారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్/నాయుడుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని చెన్నూరు కాపువీధిలో కాపురం ఉంటున్న సులోచనమ్మ పొరుగింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆమె మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. ● నాయుడు పేట పట్టణంలోని గిండివారితోటలో నివాసం ఉంటున్న సావిత్రమ్మ శనివారం ఉదయం ఇంటి ముందర ముగ్గు వేస్తుండగా ఆమె మెడలో నుంచి 3 సవర్ల సరుడును గుర్తుతెలియని యువకుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

పదో తరగతి విద్యార్థులు విద్యా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

చిల్లకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు విద్యాసామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని డీఈవో ఎంవీఎస్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుల్లో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించి వారి సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, కోడిగుడ్లు, చిక్కీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చంద్ర, శ్రీనివాసులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యందుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఈఎస్ ఉషశ్రీ

వెంకటగిరి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల యజమానులు బెల్టు దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉషశ్రీ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం అరవపాళెం, నాగులగుంటపాళెం, బ్యాండుపాళెం గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటు సారా కోసం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచి తరచూ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కొనుగోలుకూ బిల్లు ఇవ్వాలి

వెంకటగిరి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేస్తే ప్రతి వస్తువుకూ బిల్లులు అందజేయాలని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ సుచేంద్రప్రసాద్, వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కల్తీ ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి శాశ్వత భవనం నిర్మించండి

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌జేఆర్ గిరిజన కాలనీలో అంగన్‌వాడీకి శాశ్వత భవనాన్ని నిర్మించాలని శనివారం మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్ ఎంపీడీవో అన్నపూర్ణరావుకు వినతిపత్రం అందజేశారు.

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన



ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన తహసీల్దార్ నరసింహరావు, ప్రిన్సిపాల్ సురేష్

సూళ్లూరుపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో శనివారం ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు నరసింహరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, 2025 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉన్నా, తప్పులు ఉన్నా సరిదిద్దుకోవచ్చునన్నారు.

హై టెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణం నిలిపివేత

పెళ్లకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి వద్ద పంట కాలువపై చేపట్టిన హైటెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణ పనులను ఆపేశారు. 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న హైవోల్టేజ్ విద్యుత్ తీగల ఎత్తు పెంచేందుకు టవర్ నిర్మాణ పనులకు గుంతలను తవ్వారు. పంట కాలువపై టవర్ నిర్మాణం చేపడితే ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు అధికారులకు విన్నవించుకున్నారు. శనివారం కాంట్రాక్టర్ హిటాచీ సాయంతో టవర్ నిర్మాణం కోసం తవ్విన గుంతలను పూడ్చి వేశారు.

కల్యాణ వెంకన్న సేవలో ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాజికండ్రిగలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి సేవలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులు పాల్గొన్నారు. శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులతో కలసి వెంకటేశ్వరస్వామి పూజల్లో పాల్గొన్నారు.



పూజాసామగ్రి తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల